
షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక




సంపుటి : 1 సంచిక : 240 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 12 జూలై 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 240 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Friday 12 july 2024 PAGES : 8 PRICE : 5/-

## ఐదు ఉద్యోగాలకు వెయ్యి మందికిపైగా రాక..

- జాబ్ ఇంటర్వ్యూలో తొక్కిసలాట
- ఈ నెల 9న అంకలేశ్వర్‌లోని హోటల్ లార్డ్స్ ప్లాజాలో ఒక కెమికల్ సంస్థ వాక్-ఇన్ ఇంటర్వ్యూ
- హోటల్ గేటు నుంచి లోపలకు వెళ్లేందుకు ప్రయత్నం



## ఇండియాలోనే ఆత్మహత్యలు అధికం

- ఒకప్పటిలా పరిస్థితులు లేవు. పని అంత కన్నా లేదు
- ఆర్థిక సమస్యలు ఎక్కువే.
- డిప్రెషన్ వల్ల కొందరు క్షణికావేశంలో చనిపోవాలనే నిర్ణయం
- పని ఒత్తిడి, ఆర్థిక సమస్యలు, భార్య భర్తల మధ్య అన్యోన్యత లోపించడం, ఆరోగ్య సమస్యల వల్ల సూసైడ్



# మళ్లీ నేనే స్టీల్ ప్లాంట్‌ను కాపాడుతా

- ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తైతే ప్రతి ఎకరాకు సాగునీరు
- రూ.800 కోట్లతో మొదటి దశ పనులు చేపట్టి 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు
- కృష్ణా-గోదావరి-పెన్నా-వంశధార నదులను అనుసంధానం చేస్తే రాష్ట్రంలో కరవు ఉండదు
- అనకాపల్లి జిల్లా దార్లపూడి వద్ద పోలవరం ఎడమ కాల్వను పరిశీలించిన సీఎం
- విశాఖ స్టీల్ ప్లాంట్ పై తప్పుడు ప్రచారం
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



*'ఓట్లు వేసి గెలిపించిన వారి రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. రాష్ట్రంలో ఉభయ గోదావరి జిల్లాల తర్వాత ఎక్కువ ఆదరించిన ప్రాంతం ఉత్తరాంధ్ర. కూటమి అభ్యర్థులను మంచి మెజారిటీతో గెలిపించారు. మీ రుణం తీర్చుకోవడానికే ఇక్కడికి వచ్చా. భగవంతుడు నాకు ఇచ్చిన శక్తినంతా ఉపయోగించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి మీ రుణం తీర్చుకుంటా అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు*

**అనకాపల్లి**

విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. మళ్ళీ విశాఖ స్టీల్ ప్లాంట్ మీద విషం కక్కుతున్నారని మండిపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... "వాజపేయి ప్రభుత్వంలో నేను స్టీల్ ప్లాంట్ కాపాడాను. మళ్ళీ నేను స్టీల్ ప్లాంట్ కాపాడతాను" అని స్పష్టం చేశారు. వైసీపీ అబ్బదాలు వింటే నష్టం జరుగుతుందన్నారు. కరుడ గట్టిన దొంగలు ఈ వైసీపీ వాళ్ళు అని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. విశాఖను దోచుకున్నారని ఆరోపించారు. వాళ్ళని వదిలి పెట్టే ప్రసక్తి లేదన్నారు. రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని... ఆ గొయ్యిలు పెట్టిన వారిని ఆ గోతులో ఉంచాలంటూ సీఎం చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'ఓట్లు వేసి గెలిపించిన వారి రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. రాష్ట్రంలో ఉభయ గోదావరి జిల్లాల తర్వాత - మిగతా3లో



## రేషన్ బియ్యం అక్రమ తరలింపులో ఐపీఎస్‌ల పాత్ర

- మంత్రి నాదెండ్ల మనోహర్ సంచలన వ్యాఖ్యలు
- కాకినాడలో 43,249 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సీజ్ చేసినట్లు వెల్లడి
- అక్రమ తరలింపులో ఐదుగురు ఐపీఎస్‌ల పాత్ర ఉందని వ్యాఖ్య
- పేదలకు అందాల్సిన బియ్యాన్ని పక్కదోవ పట్టించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరిక

రేషన్ బియ్యం అక్రమ తరలింపులో ఐపీఎస్ అధికారుల పాత్ర ఉందంటూ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాకినాడలో 43,249 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ అక్రమ - మిగతా3లో



## ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ విజ్ఞప్తి

- మణిపూర్‌లో గతేడాది మేలో ఘర్షణలు చెలరేగాయి
- దాంతో ఆ రాష్ట్రం అతలాకుతలమైంది
- మణిపూర్ రాష్ట్రం రెండుగా విభజితమైంది
- మణిపూర్‌లో ఘర్షణలు అనంతరం ఆ రాష్ట్రానికి తాను మూడోసారి వెళ్లా
- నాటికి నేటికి ఆ రాష్ట్రంలో పరిస్థితుల్లో ఏటువంటి మార్పు లేదని ఆవేదన


# సొంత నియోజకవర్గంపై ఫోకస్

- అందరి దృష్టి ఆకర్షిస్తున్న పవన్!
- టీడీపీ జనసేన బీజేపీ కూటమి కట్టడంతో ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ భాగస్వామిగా ఉన్నారు.
- తనను ఎమ్మెల్యేగా గెలిపించిన పిఠాపురంపై పవన్ కళ్యాణ్ స్పెషల్ ఫోకస్ "
- మొదట పైలెట్ ప్రాజెక్టుగా పిఠాపురంలో అమలుచేసేందుకు పవన్ కళ్యాణ్ ప్రణాళికలు
- తన సొంత నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు.. సామాన్యుడు సమస్యలతో ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో



**పిఠాపురం**

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ 2024 ఎన్నికల్లో పిఠాపురం శాసనసభ్యుడిగా గెలిచి తొలిసారి చట్టసభల్లో అడుగుపెట్టారు. టీడీపీ జనసేన బీజేపీ కూటమి కట్టడంతో ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ భాగస్వామిగా ఉన్నారు. డిప్యూటీ సీఎం హోదాలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రిత్వ బాధ్యతలు స్వీకరించారు. మంత్రిగా తన శాఖ బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన పిఠాపురంపై - మిగతా3లో



## ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడమే నా తొలి బాధ్యత

- రాష్ట్రంలోని ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం.. ఎకానమీని పునరుద్ధరించడం తమ లక్ష్యం
- కేంద్ర ప్రభుత్వం 16 పథకాలను ఆపేసిందని.. వాటిలో 60 శాతం రాష్ట్రం... 40 శాతం కేంద్రం నిధులు పెట్టేవి
- కామన్ మ్యాన్ నుంచి వచ్చే కన్నా పరిశ్రమల నుంచి వచ్చే ఆదాయమే ఎక్కువ
- స్థానిక సంస్థలకు రూ.250 కోట్లు విడుదల
- ఆర్థికమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పయ్యావుల

**అమరావతి**

ఆర్థిక మంత్రిగా పయ్యావుల కేశవ్ నేడు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆవెంటనే 15 వ ఆర్థిక సంఘం నిధులు 250 కోట్ల రూపాయలు స్థానిక సంస్థలకు విడుదల చేస్తూ ఫైల్‌పై సంతకం చేశారు. ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. ఈ సందర్భంగా ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం తన మొదటి బాధ్యతగా - మిగతా3లో

# ఉపాధ్యాయ బదిలీల్లో రాజకీయ జోక్యం ఉండొద్దు



- టీచర్లపై అనవసర యాప్‌ల భారాన్ని తగ్గించాలన్న లోకేశ్
- ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య తగ్గుదలపై నివేదిక ఇవ్వాలన్న మంత్రి
- పాఠశాల విద్య ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష

**అమరావతి**

ఇకపై ఉపాధ్యాయ బదిలీలు పారదర్శకంగా జరిగాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యలో చేపట్టాల్సిన మార్పులు, ప్రమాణాల మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై పాఠశాల విద్య ఉన్నతాధికారులతో మంత్రి సచివాలయంలో బుధవారం సాయంత్రం దాదాపు 3 గంటలపాటు సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఉపాధ్యాయుల బదిలీల విషయంలో గతంలో మాదిరి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా విధివిధానాలని రూపొందించాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఈ విషయంలో ఉపాధ్యాయ సంఘాల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు, అనవసరమైన యాప్‌ల భారాన్ని తగ్గించి, పూర్తిస్థాయి బోధన పైనే దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి పేరెంట్స్ కమిటీలను భాగస్వాములను చేసే అంశాన్ని పరిశీలించాలని - మిగతా3లో

## ఏపీలో పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు బదిలీలు

ఆంధ్రప్రదేశ్‌లో 19 మంది ఐఏఎస్‌ల బదిలీ

ఇద్దరు ఐపీఎస్ అధికారులనూ బదిలీ చేసిన ప్రభుత్వం

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్

గ్రామ వార్డు సచివాలయం అదనపు బాధ్యతలు సురేశ్ కుమార్‌కు అప్పగింత

# మళ్లీ నేనే స్టీల్ ప్లాంట్‌ను కాపాడుతా

-మొదటిపేజీ తరువాయి

ఎక్కువ ఆదరించిన ప్రాంతం ఉత్తరాంధ్ర. కూటమి అభ్యర్థులను మంచి మెజారిటీతో గెలిపించారు. మీ రుణం తీర్చుకోవడానికే ఇక్కడికి వచ్చా. భగవంతుడు నాకు ఇచ్చిన శక్తినంతా ఉపయోగించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి మీ రుణం తీర్చుకుంటా అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి ఉత్తరాంధ్రలో చంద్రబాబు నాయుడు పర్యటించారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గం దార్లపూడి వద్ద గురువారం పోలవరం ఎడమ కాల్వను పరిశీలించారు. అంతకుముందు కాల్వ పనులపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పర్యటనకు వచ్చిన సీఎంకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు, జిల్లా ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తైతే ఉత్తరాంధ్రలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించవచ్చని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సుజల స్రవంతిని పూర్తి చేస్తే ఉత్తరాంధ్ర ప్రాంతమంతా అభివద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లాలో 2.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు తాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది. సుజల స్రవంతి పనుల్లో టీడీపీ హయాంలో చేసిన పనులు తప్ప గత ప్రభుత్వంలో ఒక్క ముందడుగు పడలేదన్నారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని, ఒక్క ఇంచు కూడా పని ముందుకు కదల్లేదన్నారు. ఐదేళ్లలో ఎక్కడైనా తట్ట మట్టి వేశారా? అని ప్రశ్నించారు. అరాచకాలు చేసిన వ్యక్తిని, తప్పులు చేసిన వ్యక్తిని ప్రజాకోర్టులో శిక్షించారు. రాజకీయాల్లో విర్రవీగితే సరిచేసే శక్తి ప్రజలకే ఉంది. ప్రజలు గెలవాలి..రాష్ట్రం నిలబడాలని ఎన్నికల ముందు ప్రచారం చేశాం. ఇప్పుడు ప్రజలు గెలిచారు..రాష్ట్రాన్ని నిలబెట్టడానికి మేము కష్టపడతాం. ఇప్పటికే పోలవరం, అమరావతి, విద్యుత్ రంగంపై శ్వేతపత్రం విడుదల చేశాం. పోలవరంను 72 శాతం నేను పూర్తి చేశాను. ఒక దుర్మార్గుడు వచ్చి డయాఫ్రం వాల్ ను గోదావరిలో కలిపేశారు. కాఫర్ డ్యామ్ లు డ్యామేజ్ అయ్యాయి. 2021 జూన్ కు నీళ్లు రావాల్సి ఉండగా నిర్వీర్యం చేశారు. పోలవరం రాష్ట్రానికి వరం. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తి చేసి పోలవరం ద్వారా గోదావరి నీళ్లు తీసుకొస్తే ప్రతి ఎకరాకు నీరు అందించొచ్చు.. కరువు అనే సమస్య ఉండదు. గత ప్రభుత్వ నిర్వాకంతో పోలవరం పూర్తవ్వడానికి ఆలస్యం అవుతోంది. అందువల్ల పురుషోత్త



పట్నం, పుష్కర్ లిఫ్ట్ ద్వారా 2,500 క్యూసెక్కుల నీటిని ఈ ప్రాంతానికి తీసుకురావొచ్చు. అండర్ పాస్ లకు కూడా టెండర్లు పిలిచి త్వరితగతిన పూర్తి చేస్తాం.' అని సీఎం తెలిపారు.

**నదుల అనుసంధానంతో కరవు నివారణ**

'ఉత్తరాంధ్ర సుజల స్రవంతిలో కుడి కాలువ 214 కి.మీ పూర్తి కావాల్సి ఉంది. మొదటి విడతగా కాలువను 93 కి.మీ పూర్తి చేయడానికి రూ.800 కోట్లు ఖర్చు అవుతుంది. దీంతో లక్ష ఎకరాలకు అనకాపల్లి పరిధిలో నీరందించవచ్చు. ఇప్పుడే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం. యాక్షన్ ప్లాన్ తయారు చేశాక మరింత వేగవంతంగా పనులు పూర్తి చేస్తాం. ఉమ్మడి తూర్పు గోదావరి, విశాఖ జిల్లాల్లో 4 లక్షల ఎకరాలకు పోలవరం కుడి కాల్వ ద్వారా సాగునీరు అందించవచ్చు. 23 టీఎంసీల నీళ్లతో అనకాపల్లి జిల్లాలో ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరందించవచ్చు. రూ.800 కోట్లు ఖర్చు చేసి 93వ కి.మీ వరకు 2.20 లక్షల ఎకరాలకు నీరందించేందుకు మొదటి విడతలో పనులు పూర్తి చేస్తాం. ఈ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంశధార నది దాకా వెళ్తుంది. వంశధార-గోదావరి-కష్ణా-పెన్నా నదులు అనుసంధానం చేసి రాష్ట్రంలో కరువు లేకుండా చేస్తాం." అని సీఎం స్పష్టం చేశారు

**చెరుకు రైతులకు న్యాయం చేస్తా**

"ఈ ప్రాంతంలోని షుగర్ ఫ్యాకర్టీ రైతులకు కూడా హామీ ఇస్తున్నా.. గత అసమర్థ ప్రభుత్వం కారణంగా 3 షుగర్ ఫ్యాక్టరీలు పడకేశాయి. ఇక్కడి రైతులకు కూడా న్యాయం జరగాలి.. వారి భాగస్వామ్యంతోనే ఫ్యాక్టరీలు నడవాలి. రైతులకు న్యాయం చేస్తాం. శాశ్వతంగా సమస్యను పరిష్కరిస్తాం. నేను కష్టపడతాను.. సంపద సష్టించి ఆదాయం పెంచి పేదలకు పంచుతాం. మీకు వెసులుబాటు ఇవ్వాల్సిన బాధ్యత ఎన్డీయే ప్రభుత్వంపై ఉంది. దేశంలో ఎక్కడా ఇవ్వని విజయాన్ని ఏపీ ప్రజలు ఎన్డీయేకు ఇచ్చారు. ఇది చారిత్రక విజయం. 95 వేల మెజారిటీతో అభ్యర్థులను గెలిపించారు. మీ రుణం తీర్చుకోవడం మా బాధ్యత. దొంగ మాటలు చెప్పేవాళ్ల మాటలు నమ్మి బజారులో తిరగనిస్తే బతుకులు ఏమవుతాయో ఆలోచించాలి." అని సీఎం పిలుపునిచ్చారు "విశాఖ స్టీల్ ప్లాంట్ ను ఏ విధంగా కాపాడుకోవాలో ఆలోచిస్తున్నాం.. కానీ ఒక పనికి మాలిన పార్టీ ఉంది.. ఆ పార్టీ నేతల పొట్ట నిండా అబద్ధాలే. వారికి కల వచ్చిందంటా... అమ్మడానికి నేను ఒప్పుకున్నానంట. తెలుగువారి ఆత్మ గౌరవానికి ప్రతీక విశాఖ ఉక్కు. "విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు" అని పోరాడి ఫ్యాక్టరీని సాధించుకున్నాం. నాడు ప్రైవేట్ పరం చేస్తామని ప్రతిపాదనలు వచ్చినప్పుడు నేను పోరాడి అడ్డుకున్నా. కేంద్రం నుండి ఆర్థిక సాయం కూడా తీసుకొచ్చాం. స్టీల్ ప్లాంట్ ను కాపాడుకునే బాధ్యత మాదే. అబద్ధాలు చెప్పే వారి మాటలు ఖండిస్తూ వాస్తవాలు చెప్పాలి. కరుడుగట్టిన ఆర్థిక ఉగ్రవాదులు విశాఖను దోచేశారు..వీళ్లను వదలిపెట్టను. ప్రజల మనోభావాలకు అనుగుణంగా పని చేస్తా." అని సీఎం చంద్రబాబు అన్నారు.

# సొంత నియోజకవర్గంపై ఫోకస్

-మొదటిపేజీ తరువాయి

పవన్ కళ్యాణ్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఏదైనా పనిని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిచాలన్నా.. మొదట పైలెట్ ప్రాజెక్టుగా పిఠాపురంలో అమలుచేసేందుకు పవన్ కళ్యాణ్ ప్రణాళికలు రచిస్తున్నారు. తన సొంత నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు.. సామాన్యుడు సమస్యలతో ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో పవన్ కళ్యాణ్ ముందుకెళ్తున్నారు. సమస్యల రహిత నియోజకవర్గంగా పిఠాపురాన్ని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఆయన ముందుకెళ్తున్నారు. ఓ ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు మిగతా నియోజకవర్గాలతో పోల్చినప్పుడు ఎక్కువుగా జరుగుతాయి. అలాగే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన సొంత నియోజకవర్గం అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారనే చర్చ సాగుతోంది.

**స్పెషల్ గ్రీవెన్స్‌సెల్..**

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన సొంత నియోజకవర్గం పిఠాపురంలో గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటుచేశారు. ప్రతి ఒక్కరూ తమ సమస్యల కోసం పవన్‌ను కలిసే అవకాశం లేకపోవడంతో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఓ వ్యవస్థను ఏర్పాటు చేశారు. గ్రీవెన్స్ సెల్‌కు వచ్చే ప్రతి అర్జీపై పరిశీలన చేసి..



వాస్తవమైన సమస్య అయితే తక్షణమే సంబంధిత విభాగానికి పంపించి పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నారు. అర్జీ ఇచ్చిన తర్వాత సమస్యకు సంబంధించిన అప్‌డేట్స్‌ను బాధితులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారు. దీంతో పవన్ ప్రజలకు మరింత దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు.

**అభివృద్ధిపై ఫోకస్..**

పిఠాపురం అభివృద్ధిపై పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టిసారించారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను గుర్తించారు. ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరించేందుకు ఇప్పటికే పవన్ కళ్యాణ్ తన కార్యాచరణను ప్రారంభించినట్లు తెలుస్తోంది. పిఠాపురం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గం అభివృద్ధి కోసం పవన్ కళ్యాణ్ నిరంతరం ప్రయత్నిస్తున్నారట. నియోజకవర్గంలోని యువత కోసం ప్రత్యేక స్కిల్ సెంటర్‌ను ఏర్పాటుచేసేందుకు అవసరమైన ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**దేశంలోనే ఆదర్శంగా..**

పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవ ర్గంగా తీర్చిదిద్దుతానని పవన్ కళ్యాణ్ పదే పదే చెబుతున్నారు. ప్రతి విషయంలో తన నియోజకవర్గం ఆదర్శంగా ఉండాలని అక్కడి ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు. అభివృద్ధి, ఉపాధి అంశాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ.. అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగించేలా పవన్ కళ్యాణ్ చర్యలు చేపట్టారు. రానున్న కాలంలో పిఠాపురంలో మరింత మార్పు తప్పకుండా చూస్తారని అక్కడి ప్రజలకు చెబుతున్నారు. నెలరోజుల పాలనలో పవన్ అదరగొడుతున్నారంటూ రాష్ట్ర ప్రజలు ప్రశంసిస్తున్నారు. భవిష్యత్తులోనూ ఇదే విధంగా పనిచేయాలని ఆకాంక్షిస్తున్నారు.

# తిరుమలలో మొదలైన ప్రక్షాళన

**తిరుమల :** తిరుమల.. కలియుగ వైకుంఠం. దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచమంతా భక్తులున్న దివ్యక్షేత్రం. శ్రీనివాసుడు ఆపద మొక్కులవాడు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం. అందుకే ఆ కలియుగ దైవం దర్శనం కోసం .. ఎక్కడెక్కడి నుంచో సామాన్య భక్తులు వ్యవయప్రయాసలకు ఓర్చి ఏడు కొండలెక్కి వసతులున్నా లేకున్నా రోడ్లపై పడిగాపులు కాస్తారు. కంపార్ట్‌మెంట్లలో గంటలకు గంటలు ఎదురు చూస్తారు. కిక్కిరిసిన క్యూలైన్లలో తోసుకుంటూ.. ఆనందనిలయం ముందు దివ్యదర్శనానికి అడుగుపెడతారు. అరసెకనులో గర్భగుడి బయట క్యూలైన్లలో ఉన్న సామాన్య భక్తులను సిబ్బంది లాగి అవతల పడేస్తుంటే.. అరసెకను ఆ వేంకటేశ్వరుడి దివ్య దర్శనం చేసుకుని అరమోడ్పు కన్నులతో ఆలయం బయటకు చేరతారు. ఇది తిరుమల క్షేత్ర దర్శనం అనగానే మనకు గుర్తుకొచ్చేవి.తిరుపతిలో అడుగు పెట్టింది మొదలు.. మళ్లీ తిరుమలలో దర్శనం ముగించుకుని కొండ దిగే వరకు సామాన్య భక్తులకు ఎన్నో అవస్థలు.. ప్రభుత్వాలు మారుతున్నా.. పాలక మండళ్లు మారుతున్నా నిత్యం భక్తుడికి ఆ వెంకన్న దర్శనం అంటే కేవలం దైవదర్శనం మాత్రమే కాదు. సమస్యలను ముందు దర్శించి వాటిని అధిగమించి ఆ తర్వాతగానీ శ్రీనివాసుడిని దర్శించుకోవడం సాధ్యం కాదు. భార్యాభర్తలు, పిల్లపాపలు, వృద్ధులు ఇలా కుటుంబాలతో కలిసి శ్రీవారిని దర్శించుకునేందుకు తిరుమలకు వస్తుంటారు సామాన్య భక్తులు. కొండపైకి రాగానే వాళ్లకు ముందు వసతి పెద్ద సమస్యగా మారుతుంటుంది. కాటేజీలున్నా.. భక్తుల రద్దీకి తగినంత ఉండవు. రోజురోజుకీ తిరుమలకు వచ్చే భక్తులు పెరుగుతూనే ఉన్నారు. కానీ.. కొండపై ఆ రద్దీని తట్టుకుని భక్తులకు సౌకర్యాలు కల్పించడం పెను సవాలే. వీఐపీ భక్తులకు ప్రత్యేకమైన కాటేజ్‌లు, వసతులున్నాయి. బ్రేక్ , స్పెషల్ పేరుతో రెండు మూడు గంటల్లోనే వెంకన్న దర్శనం పూర్తవుతుంది. సామాన్య భక్తులకు వసతి సముదాయాలు అంతంత మాత్రమే. కొండపై వీఐపీలకే ప్రాధాన్యమిస్తున్నారని వారి సేవలోనే టీటీడీ తరిస్తోందన్న ఆరోపణలు పెరిగాయి. వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్నా టీటీడీ మాత్రం ఉన్న కాటేజీలతోనే సర్దుబాటు చేస్తోందని.. సామాన్య భక్తులకు కొత్త కాటేజీలు, వసతి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.వారాంతాలు, పర్వదినాలు, సెలవులు, బ్రహ్మోత్సవాలు.. ఇలాంటి సమయాల్లో తిరుమలకు రద్దీ విపరీతంగా పెరుగుతూ ఉంటుంది. అప్పుడు భక్తులు పడే అవస్థలు అన్నీఇన్నీ కావు. ఓవైపు తమ ఇలవేల్పు, నమ్మిన దైవమైన వేంకటేశ్వరుడిని దర్శించుకోవాలి. అంతకు ముందు కొండపై క్యూలైన్లలో సమస్యలతో సావాసం చేసి ముందుకు సాగాలి. రద్దీ సమయాల్లో వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోతాయి. వెలుపలకు కిలోమీటర్ల క్యూలైన్లు కనిపిస్తాయి. చిన్నపిల్లలతో వచ్చినవాళ్లు, వృద్ధులు ఆ క్యూలైన్లు, కంపార్టమెంట్లలో ముందుకు నడవడమంటే కత్తిమీద సామే. అలాంటి వారికి ప్రత్యేక వసతులు కల్పించి వీలైనంత త్వరగా దర్శనం పూర్తి చేయించాల్సిన అవసరముందనేది భక్తుల నుంచి వస్తున్న విన్నపం.కంపార్ట్‌మెంట్లలో దర్శనం కోసం గంటల తరబడి వేచి చూడాలి. అక్కడ పలు ప్రాంతాలకు చెందిన భక్తులుంటారు. పెరుగన్నం, పులిహోర, సాంబార్ రైస్ ఇలా ప్రసాదాలను కంపార్టమెంట్లలో భక్తుల ఆకలి తీర్చేందుకు టీటీడీ అందిస్తుంటుంది. వీటి నాణ్యత విషయంలో భక్తుల నుంచి రకరకాల కంప్లైంట్స్ అందుతున్నాయి. నిత్య అన్నదాన సత్రంలో అన్నప్రసాదం క్వాలిటీపైనా రకరకాల విమర్శలున్నాయి. దర్శనానంతరం శ్రీవారి దివ్యప్రసాదంగా లడ్డూను భక్తులకు అందిస్తారు. వీటి తయారీ, నాణ్యత, లడ్డూ సైజ్‌పై కూడా ఫిర్యాదులు ఈమధ్యకాలంలో పెరిగాయి. ఒకప్పుడు లడ్డూ వారం రోజులు నిల్వ ఉన్నా ఎలాంటి దుర్వాసన వచ్చేది కాదు. కానీ.. అందులో వాడే సరుకుల క్వాలిటీలోపం కారణంగా రెండ్రోజులకే లడ్డూ ప్రసాదం చెడుపోతోందన్న కంప్లైంట్స్ వ్యక్తమవుతున్నాయి. వీటిపైనా ప్రత్యేకమైన దృష్టి పెట్టాలనేది భక్తుల ఆవేదన.ప్రక్షాళన తిరుమల నుంచే మొదలు పెడతామని ఏపీ సీఎం చంద్రబాబు శ్రీవారి దర్శనార్థం కొండకు వచ్చిన సందర్భంగా స్పష్టం చేశారు. భక్తులు ఎదుర్కొనే సమస్యలు ఒకవైపు ఉంటే.. గత పాలకమండలిపై విమర్శలు, అవినీతి ఆరోపణలు తీవ్రమయ్యాయి. ముందుగా టీటీడీ పాలకమండలి ఈవోను మార్చి కొత్త ఈవోగా శ్యామలరావుకు బాధ్యతలు అప్పగించింది ప్రభుత్వం. బాధ్యతలు చేపట్టిన రోజు నుంచే దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు. ఏయే వ్యవస్థల్లో లోపాలున్నాయో గుర్తించి సరిచేసేందుకు స్టేట్‌లెవల్ విజిలెన్స్ కమిటీ రంగంలోకి దిగింది.

## రేషన్ బియ్యం అక్రమ తరలింపులో ఐపీఎస్‌ల పాత్ర



-మొదటిపేజీ తరువాయి

తరలింపులో ఐదుగురు ఐపీఎస్‌ల పాత్ర ఉందన్నారు. పేదలకు అందాల్సిన బియ్యాన్ని పక్కదోవ పట్టించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విజయవాడ ఏపీఐఐసీ కాలనీలోని రైతు బజార్లో రాయితీపై నాణ్యమైన బియ్యం, కందిపప్పు పంపిణీ చేసే మొదటి కౌంటర్‌ను నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆదేశాలతో సామాన్యులకు నిత్యావసర సరుకులను రాయితీపై అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ... ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హోల్ సేల్ దుకాణదారులు, రిటైల్ వర్తకులు కూడా రూ.160కే నాణ్యమైన కిలో కందిపప్పును అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మున్ముందు పంచదార సహా పలు చిరుధాన్యాలను కూడా రైతు బజార్లలో రాయితీపై విక్రయిస్తామని తెలిపారు. ఒక్కొక్కరికి కిలో కందిపప్పు, 5 కిలోల బియ్యం చొప్పున అందిస్తామన్నారు. ప్రజలు దీనిని ఉపయోగించుకోవాలని సూచించారు.

## ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడమే నా తొలి బాధ్యత

-మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 16 పథకాలను ఆపేసిందని.. వాటిలో 60 శాతం రాష్ట్రం... 40 శాతం కేంద్రం నిధులు పెట్టేవని పేర్కొన్నారు. వీటి మొత్తాన్ని ఆపేశారని పయ్యావుల కేశవ్ వెల్లడించారు. కేంద్రం నిధులు కూడా వాడుకోని పరిస్థితి వైసీపీ హయాంలో ఉందన్నారు. వ్యవస్థలు అన్నీ గాడి తప్పాయన్నారు. ఎవరు జగన్‌కి సలహా ఇచ్చారో కూడా తెలియదని పయ్యావుల కేశవ్ అన్నారు.

రాష్ట్రంలోని ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం.. ఎకానమీని పునరుద్ధరించడం తమ లక్ష్యమని పయ్యావుల కేశవ్ తెలిపారు. గడచిన ఐదేళ్లలో వ్యవస్థను దెబ్బతీశారన్నారు. కామన్ మ్యాన్ నుంచి వచ్చే కన్నా పరిశ్రమల నుంచి వచ్చే ఆదాయమే ఎక్కువన్నారు. సెంట్రల్ గవర్నమెంట్ స్కీంలు సరిగా వాడితే ఎంతో మేలన్నారు. ఎలక్ట్రిసిటీపై డ్యూటీలను దారుణం గా వేశారన్నారు. అక్క చెల్లమ్మలకు, అవ్వ తాతలకు జగన్ ఇచ్చిన దాని కన్నా దోచింది ఎక్కువని పయ్యావుల కేశవ్ అన్నారు. చంద్రబాబు టీం శక్తికి మించి ఈ రాష్ట్రం కోసం పని చేస్తోందన్నారు. ఏపీలో టాక్సాషన్‌ను కౌంటర్ ప్రొడక్ట్ లెవెల్‌కి తీసుకు వెళ్లారన్నారు. టాక్స్‌లు పెంచడం ఒక స్థాయికి తెచ్చారని.. చివరకు భరించలేకుండా చేశారన్నారు. వ్యాపారాలను కొలాప్స్ చేశారన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, కార్యదర్శులు డా.కెవివి. సత్యనారాయణ, జానకి, వినయ్ చంద్, చీఫ్ కమీషనర్ స్టేట్ ట్యాక్సెస్ గిరిజా శంకర్, ఆర్థిక శాఖ స్పెషల్ సెక్రటరి కె.ఆదినారాయణ, డైరెక్టర్ ట్రెజరీస్ మోహన్ రావు, ఎపి జిఎల్ఐ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## ఉపాధ్యాయ బదిలీల్లో రాజకీయ జోక్యం ఉండొద్దు

-మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు. రాబోయే సమీక్షలో మూసివేసిన పాఠశాలలకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. పాఠశాలల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ఎన్ని నిధులు అవసరమవుతాయనే అంశంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠశాలలకు పెద్దఎత్తున విద్యార్థులు బదిలీ కావడానికి గల కారణాలు అన్వేషించి సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. దీంతో పాటు చిల్డ్రన్ లెర్నింగ్ అవుట్ కమ్స్, విద్యా ప్రమాణాల పెంపునకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే అంశంపై సమగ్రంగా చర్చించారు. విద్యా ప్రమాణాల పెంపునకు దేశంలో అత్తుత్తమ విధానాలు ఎక్కడ అమలవుతున్నాయో అధ్యయనం చేసి నివేదిక అందించాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా జర్మనీ, ఆస్ట్రియాతోపాటు పలు అభివృద్ధి చెందిన దేశాల విద్యావ్యవస్థలను మంత్రి ప్రస్తావించారు. రాయలసీమ ప్రాంతంలో ఎక్కడ పాఠశాలల కొరత ఉంది? ఎక్కన నూతన పాఠశాలలు ప్రారంభించాలి? అనే అంశాల పైనా ఈ సమావేశంలో అధికారుల నుంచి వివరాలు తీసుకున్నారు. ఈ సమీక్షా సమావేశంలో స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ కోన శశిధర్, స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్ కుమార్, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, అడల్ట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నిధి మీనా తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు బదిలీలు..

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ సారధ్యంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జరుగుతున్న అధికారుల బదిలీల్లో భాగంగా తాజాగా మరికొందరు ఆఫీసర్లను ప్రభుత్వం ట్రాన్స్‌ఫర్ చేసింది. స్పెషల్ సీఎస్ ఆర్‌పీ సిసోడియాను రెవెన్యూ అండ్ ల్యాండ్స్, రిజిస్ట్రేషన్‌కు బదిలీ చేసింది. ఇక ప్రస్తుతం మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న జీ.జయలక్ష్మిని సీసీఎల్‌ఏకు బదిలీ చేసింది. ఈ మేరకు సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 19 మంది ఐఏఎస్‌లను, ఇద్దరు ఐపీఎస్ అధికారులను బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అటవీ, పర్యావరణ శాస్త్ర సాంకేతిక ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా జి.అనంతరాము, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్యదర్శిగా ఆర్పీ సిసోడియా, సీసీఎల్‌ఏ చీఫ్ కమిషనర్‌గా జి.జయలక్ష్మి, ఆర్ అండ్ బీ ముఖ్యకార్యదర్శిగా కాంతిలాల్ దండే, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కార్యదర్శిగా సురేశ్ కుమార్‌లను బదిలీ చేశారు. సురేశ్ కుమార్‌కు గ్రామ వార్డు సచివాలయం పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. జీఏడీ కార్యదర్శిగా కూడా సురేశ్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఐటీ శాఖ, ఆర్టీజీఎస్ కార్యదర్శిగా సౌరభ్ గౌర్, పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ కార్యదర్శిగా యువరాజ్, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా హర్షవర్ధన్, వెనుకబడిన తరగతుల సంక్షేమ కార్యదర్శిగా పి.భాస్కర్‌లను బదిలీ చేశారు. పి.భాస్కర్‌కు ఈడబ్ల్యుఎస్, జీఏడీ సర్వీసెస్ అదనపు బాధ్యతలను అప్పగించారు. సాంఘిక సంక్షేమ కార్యదర్శిగా కె.కన్నబాబును బదిలీ చేశారు. ఆయనకు గిరిజన సంక్షేమం, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌గాను బాధ్యతలు అప్పగించారు.

వినయ్ చంద్‌ను పర్యాటక శాఖ కార్యదర్శిగా, వివేక్ యాదవ్‌ను యువజన సర్వీసులు, క్రీడల శాఖ కార్యదర్శిగా, సూర్యకుమారిని మహిళా, శిశు సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమ కార్యదర్శిగా, సి.శ్రీధర్‌ను ఇండస్ట్రీస్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. జె.నివాస్‌కు ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శిగా, విజయరామరాజుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌గా, ఢిల్లీరావుకు వ్యవసాయ శాఖ డైరెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. హిమాంశు శుక్లాకు సమాచార, పౌరసంబంధాల శాఖ బాధ్యతలను అప్పగించారు. వ్యవసాయ శాఖ నుంచి హరికిరణ్‌ను బదిలీ చేశారు. గిరిజా శంకర్‌ను ఆర్థిక శాఖ నుంచి రిలీవ్ చేశారు.

**ఇద్దరు ఐపీఎస్‌లు బదిలీ**

రాష్ట్రంలో ఐపీఎల్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. హోం సెక్రటరీ హరీష్ కుమార్ గుప్తాను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్, జీఏడీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా బదిలీ చేసింది. ఇక కుమార్ విశ్వజిత్‌ను హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ట్రాన్స్‌ఫర్ చేసింది.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం



# వైసీపీకి ఇక సేవలు చేయలేం

- పార్టీకి గుడ్ బాయ్ చెప్పే ఆలోచనలో కేడర్
- టీడీపీ దిశగా ప్రథమ, ద్వితీయ స్థాయి నేతల చూపు
- ఇప్పటికే దేశం పార్టీ నేతలతో ఫుల్ టచ్‌లో ఉన్న నేతలు
- కొండపిలో బలమైన శక్తిగా టీడీపీ అడుగులు
- ఇప్పటికే ఆ పార్టీ నాయకత్వానికి పరోక్షంగా మద్దతు
- ఇక కొండపి వైసీపీ క్యాడర్‌కు దిక్కెవరో ?
- ఆ పార్టీకి అంకిత భావంతో పనిచేసే నాయకుడు ఎవరో ?
- పార్టీలో రాజకీయ వెన్నుపోటుదారులకు పెద్దపీటే కారణమా ?
- కోవర్టు నేతలకు, ఓట్లు లేని వారికి అధిక ప్రాధాన్యత
- బాబోయ్ ఇక ఆ పార్టీ మాకొద్దంటున్న వైసీపీ నేతలు

**(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, జులై 11)**

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి షాక్‌కు గురిచేయగా, ఇప్పుడు కొండపిలో వైఎస్సార్‌సీపీకి ఎదురు దెబ్బ తగిలేలా ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఆ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి, పార్టీ జెండాను భుజాన వేసుకొని గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ఆరు మండలాల్లో పార్టీ నాయకత్వానికి పార్టీ సిద్ధాంతాలకి కట్టుబడి పని చేసే గ్రామస్థాయి కార్యకర్త వద్ద నుంచి నియోజకవర్గ స్థాయి పరిధిలో ఉన్న నాయకుడికి ప్రాధాన్యత ఇవ్వకపోవడమే ప్రధాన కారణమని మేధావులు అంటున్నారు. గ్రామ, మండల స్థాయి కలిగిన నాయకులకు కనీసం వైసీపీలో కష్టపడి పనిచేసే వారికి ప్రాధాన్యత తగ్గిందని, ఇప్పటికే నియోజకవర్గ నాయకత్వం వ్యవహరిస్తున్న విధానంపై విసికి వేజారి, ఇక ఆ పార్టీలో ఉండలేమని వైసీపీ ప్రథమ, ద్వితీయ స్థాయి నాయకులు తేల్చి చెబుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

**గుర్తింపు లేకేనా?**

ఇక్కడ రాజకీయ కోవర్టులకి పార్టీలో వారికి ఉన్న గుర్తింపు లేక, పార్టీకి కష్టపడే పని చేసే కార్యకర్తకి, నాయకుడికి ప్రజాదరణ నాయకుల వద్ద గుర్తింపు లేకపోవడంతో ఇక చేసేది ఏమీ లేక చేతులు ముందుకు వేసుకుని చెక్క భజన చేసుకోవాల్సిన పరిస్థితి ఎదురైందంటున్నారు. దిక్కుతోచని పరిస్థితిలో కొండపి (తరువాయి 4లో...)

# పేదలకు తక్కువ ధరకు నిత్యవసరాలు

## రాష్ట్రవ్యాప్తంగా ఒకే ధర
## రైతు బజార్‌లలో అమ్మకం
## ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 11)**

నిత్యవసర వస్తువులు ధరలు పెరిగి ప్రజల కొనుగోలు శక్తి పూర్తిగా తగ్గిందని, అందుకోసం కొత్తగా ఏర్పడిన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పేదలకు తక్కువ ధరకు కందిపప్పు అందించాలని లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ఒకే ధర నిర్ణయించి రైతు బజార్లో అమ్మకాల ప్రారంభించడం జరిగిందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు అన్నారు. నగరంలోని లాయర్ పేట రైతు బజార్లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం పేదలపై అనేక భారాలు మోపి నిత్యవసర వస్తువులు ధరలు కొనుగోలు చేయలేని స్థితిలోకి వచ్చారని అన్నారు. ఎన్నికల సమయంలో పేదలకు నిత్యావసర వస్తువులను అందుబాటులోకి తీసుకొస్తామని విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం ఏర్పడి నెలలోపే ఈ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. రైస్ మిల్లర్స్ డాల్ మిల్లర్స్ యజమానులు ముందుకు వచ్చి పేదలకు సామాన్యులకు తక్కువ ధరలకు బియ్యం, కందిపప్పు అందించడం ఒక శుభ పరిణామమని అన్నారు. ప్రజలందరూ కూడా రైతు బజార్లో వద్ద ఈస్తున్న బియ్యం, కందిపప్పును తక్కువ ధరలు తీసుకొని వారు కుటుంబాలు సంతోషంగా ఉండాలని అవకాశాన్ని ఉపయోగించు కోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఎస్ఓ ఉదయభాస్కర్, జనసేన పార్టీ అధ్యక్షుడు (తరువాయి 4లో...)



# హనుమాన్‌లాడ్జిలో పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 11)**


జరుగుమల్లి మండలం వద్దినేనివారిపాలెంకు చెందిన మూలె రవీంద్ర (27) ఒంగోలు పట్టణంలోని అద్దంకి బస్టాండ్ సమీపంలో గల హనుమాన్‌లాడ్జిలో పురుగు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గురువారం మధ్యాహ్నం సమయంలో రవీంద్ర రూము అద్దెకు తీసుకున్నాడు. గది అద్దెకు తీసుకున్నప్పటి నుంచి బయటకు రాకపోవడంతో రాత్రి 7 గంటల సమయంలో రూమ్ బాయ్ తలుపు నెట్టగా తెరుచుకుంది. గదిలో మూలె రవీంద్ర చనిపోయి ఉన్నట్లు బాయ్ గుర్తించాడు. అతని పక్కనే పురుగుల మందు డబ్బా కూడా ఉన్నట్లు లాడ్జి నిర్వాహకులు వన్ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అతని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పిడుగురాళ్ళలో డయేరియాపై ప్రభుత్వం అలర్ట్

## స్వయంగా రంగంలోకి దిగి క్షేత్ర స్థాయి పర్యటన చేసిన మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ
## డయేరియాకు గల కారణాలపై దృష్టి పెట్టామన్న మంత్రి
## మరో ఐదారు రోజులు అప్రమత్తంగా ఉండాలని సూచన
## లెనిన్ నగర్, మారుతి నగర్‌లో పరిస్థితిపై ప్రజలను ఆరా తీసిన మంత్రి
## ఎల్లుండి మరోసారి పిడుగురాళ్లకు వస్తానన్న మంత్రి నారాయణ



4



# సమస్యల వలయంలో ఇందిరమ్మ కాలనీ

## 16 ఏళ్లుగా మౌలిక వసతులు కరువు
## పట్టించుకోని అధికారులు
## మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్న కాలనీవాసులు

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 11)**

ప్రతి పేద వాడికి సొంతింటి కలను సాకారం చేసేందుకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఇందిరమ్మ కాలనీలను ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం మరిచిపోయారు. దీంతో ఏ విధంగా ప్రారంభంలో నిర్మాణాలు చేసుకుని వదిలేశారో అప్పటి నుంచి అలాగే ఉండిపోయాయి. మౌలిక వసతులు కల్పన చేపట్టక 16 ఏళ్లుగా వదిలేయడంతో శిథిల భవనాలుగా మిగిలిపోయాయి. జగనన్న కాలనీలకు కల్పించిన సౌకర్యాలు ఇందిరమ్మ కాలనీలకు కూడా కల్పిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతూ కాలం గడిపేశారు. ఇందిరమ్మ కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలని సీపీఎం, సీపీఐ, భాజాపా పార్టీలు, అనేక ప్రజా సంఘాలు ఆందోళన చేపట్టినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు అంటున్నారు. మార్కాపురం పట్టణ శివారులోని చెన్నరాయునిపల్లె గ్రామానికి సమీపంలో ఏర్పాటు చేసిన రెండో విడత ఇందిరమ్మ కాలనీ 2007-08 నుంచి నిర్మాణాలు చేపట్టినప్పుడు లబ్ధిదారులు వదిలేసి నప్పుడు ఏ విధంగా ఉందో ప్రస్తుతం 2024 కూడా అలాగే ఉంది. 3 వేల మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలు మంజూరు చేస్తే అందులో సుమారు 2500 మంది ఇంటి నిర్మాణాలు ప్రారంభించారు. లబ్ధిదారులు బేస్మట్టం, స్లాబ్ లెవల్, మరి కొంత మంది పూర్తిగా స్లాబ్ నిర్మాణాలు కూడా చేశారు. మరి కొత్త మంది గోడలు నిర్మాణం చేసి వదిలేశారు. పేదలతో కళకళలా దాల్సిన ఇందిరమ్మ కాలనీలు నేడు శిథిల భవనాలుగా మారిపోయాయి.

**నాలుగు ఏళ్లుగా కాలనీలో ఆందోళన బాట**

రహదారులు, నీటి వసతి, విద్యుత్తు, మురుగు కాలువలు ఏర్పాటు చేసి మిగిలిపోయిన నివాసాలకు కొంత వరకైనా నిధులు కేటాయిస్తే వాటిని నిర్మాణం చేసుకుంటామని గత నాలుగు ఏళ్లుగా లబ్ధిదారులు ఆందోళన చేస్తున్నారు. సీపీఎం. సీపీఐ, బీజేపీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గత ఏడాది (తరువాయి 4లో...)

# పిడుగురాళ్ళలో డయేరియాపై ప్రభుత్వం అలర్ట్

**(షణ్ముఖ వెలుగు బ్యూరో, పల్నాడు, జులై 11)**

పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో డయేరియా కేసులు పెరుగుతుండటంపై ప్రభుత్వం అలర్ట్ అయింది. పట్టంలోని లెనిన్ నగర్, మారుతి నగర్‌లో ప్రజలు డయేరియా బారిన పడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. దీంతో స్వయంగా రంగంలోకి దిగారు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి పొంగూరు నారాయణ గురువారం ఉదయం ఒకసారి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితి పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. డయేరియా పై ఎప్పటికప్పుడు తనకు సమాచారం ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఆ తర్వాత కూడా కొత్తగా మరో రెండు కేసులు నమోదు కావడంతో స్వయంగా క్షేత్ర స్థాయి పర్యటనకు మంత్రి నారాయణ వెళ్ళారు. ముందుగా పిడుగురాళ్ల లెనిన్ నగర్‌లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. వారి ఆరోగ్య పరిస్తితి పై పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి లెనిన్ నగర్, మారుతి నగర్ లో డయేరియా ప్రభావిత ప్రాంతంలో అధికారులతో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ, తాగు నీటి బోర్లను పరిశీలించారు. స్వయంగా కొంతమంది ఇళ్లకు వెళ్లి నీటి సరఫరా, వాడకంపై మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత డయేరియా కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో అధికారులతో మంత్రి నారాయణ సమీక్షించారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. పిడుగురాళ్లలోని లెనిన్



నగర్, మారుతి నగర్‌లో ఇప్పటి వరకూ 60 డయేరియా కేసులు నమోదయ్యాయని తెలిపారు. ప్రస్తుతం 39 మంది వివిధ హాస్పిటల్స్ లో చికిత్స పొందుతున్నారన్నారు. చికిత్స పొందుతున్న వారి ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పారు. కృష్ణా నది నుంచి మంచి నీరు అందించేందుకు 16 కి.మీ పైప్ లైన్ ఉందన్నారు. దీంతో పాటు పట్టణంలో 7 పవర్ బోర్స్, 36 హాండ్ బోర్స్ ఉన్నాయన్నారు. ఒక పవర్ బోర్ లో నైట్రేట్ ఉన్నట్లు పరీక్షల్లో గుర్తించారన్నారు. కృష్ణా వాటర్ పైప్ లైన్ లీకేజి ఉండటంతో ఐదు రోజులు పాటు నీటి సరఫరా నిలిపి వేశారని తెలిపారు. ఈ ఐదు రోజుల్లో బోరు నీటిని వాడారన్నారు. కృష్ణా పైప్ లైన్ ద్వారా ప్రస్తుతం తాగు నీరు ఇస్తున్నప్పటికీ ఇంకా కేసులు వస్తున్నాయన్నారు. నీటిని పరీక్ష కోసం విజయవాడ ల్యాబ్ కు ఈరోజు శాంపిల్స్ పంపిస్తున్నామని పేర్కొన్నారు. రేపు ఉదయానికి కొన్ని రిపోర్ట్ లు వస్తాయి. మరికొన్ని రిపోర్ట్‌లు 48 గంటల్లో వస్తాయన్నారు. ముఖ్యంగా లెనిన్ నగర్,మారుతి నగర్ ప్రజలు నీళ్ళు కాచి తాగాలని సూచించారు. అలాగే పట్టణంలో ఉన్న ఆర్ఓ ప్లాంట్స్ అన్నీ కూడా పరీక్షించాల్సి ఉందన్నారు. రాబోయే ఐదారు రోజుల్లో నీరు ఎక్కడ కలుషితం ఆయిందనేది క్లారిటీ వస్తుందని చెప్పారు. డయేరియాకు అసలు కారణం ఏంటి? నీరు ఎక్కడ కలుషితం అయిందో తెలిసే వరకూ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

డయేరియా వచ్చిన ఇద్దరికీ ఇతర జబ్బులు ఉండటం వల్ల చనిపోయారని, డయేరియా రాకపోతే బ్రతికే అవకాశం ఉండేదన్నారు. ఇప్పటికే డయేరియా పై సీఎం చంద్రబాబునాయుడు రోజుకు మూడుసార్లు రివ్యూ చేస్తున్నారన్నారు. రేపు అత్యవసరంగా డ్రైన్లలో సిల్ట్, ముళ్ళ కంపలు తొలగించాలని ఆదేశాలిచ్చానన్నారు. ఎల్లుండి సాయంత్రం మరోసారి పిడుగురాళ్ల వస్తానని, ప్రజలకి అధికారులందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆసియా ఇన్ఫ్రా బ్యాంక్, అమృత్ నిధుల విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిధని మంత్రి నారాయణ అన్నారు. గత ప్రభుత్వం ఇవ్వాల్సిన మ్యాచింగ్ నిధులు ఇవ్వకపోవడం తో రూ.3500 కోట్ల నిధులు రాష్ట్రానికి రాలేదన్నారు. ఆ నిధులు వచ్చి ఉంటే రాష్ట్రంలో సగం మున్సిపాలిటీల్లో డ్రెయినేజీ, మంచినీటి సమస్య పరిష్కారం అయ్యేదన్నారు. కేంద్రంతో ఉన్న మంచి సంబంధాలతో సీఎం చంద్రబాబు నిధులు తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

# సమస్యల వలయంలో ఇందిరమ్మ కాలనీ



భారీ ఎత్తున ఆందోళనలు చేశారు. కాలనీ వాసులు తమ సమ్యలను పరిష్కరించాలని తహసీల్దారు, ఉప కలెక్టర్ కార్యాలయాల వద్ద అనేక మార్లు ధర్నాలు చేశారు. సమస్యలను పరిష్కరించి సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యేకి వినతిపత్రాలు అందజేశారు. అప్పటి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌తో పాటు జిల్లా మంత్రులకు కూడా వినతిపత్రం అందజేశారు. అయినా ఫలితం లేకుండా పోయిందని లబ్దిదారులు వాపోయారు. నూతన ప్రభుత్వంలోనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగిన చర్యలు తీసుకుని ఇందిరమ్మ కాలనీ అభివృద్ధి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. మరి అధికారులు ఆ దిశగా అడుగులు వేస్తారో లేదో చూడాలి మరి....!

# నాయుడుపేట నూతన మెకానిక్స్ అసోసియేషన్ నియామకం



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జులై 11)**

నాయుడుపేట నూతన మెకానిక్స్ అసోసియేషన్ నియామకం గురువారం జరిగింది. పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని మెకానిక్స్ అసోసియేషన్ కార్యాలయంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, అధ్యక్షులుగా తిరుణామల్లి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా ఎస్డి ఆలీ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ టిడిపి నేత నెలవల రాజేష్‌లకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా షేక్ రఫీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మెకానిక్ లకు ఆటోనగర్ ఏర్పాటు చేస్తామన్న హామీని నిలబెట్టుకోలేకపోయారని అన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ సహకారంతో ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనం భేటీ విజయభాస్కర్ రెడ్డిలను కలసి ఆటోనగర్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మెకానిక్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనం భేటీ విజయభాస్కర్ రెడ్డిలకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెకానిక్స్ అసోసియేషన్ నాయకులు దశరద, నజీర్, రమేష్, ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీకి ఇక సేవలు చేయలేం

వైసీపీ పార్టీ నాయకులు, ఆరు మండలాల్లో పలువురు నేతలు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీలో ఉంటూ పార్టీని అడ్డం పెట్టుకొని పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పదవులు పొంది ధన లాభం పొంది వారి సొంత స్వలాభం కోసం పార్టీని అడ్డాగా మార్చుకొని నేనే రాజు నేనే మంత్రిగా వ్యవహరిస్తూ కార్యకర్తలను ప్రథమ, ద్వితీయ స్థాయి నేతలపై కనీసం గుర్తింపు లేకుండా రాజకీయ వెన్నుపోటుదారులకి ఇచ్చిన ప్రాధాన్యత పార్టీలో కష్టపడి పనిచేసే వారికి గుర్తించకపోవడం వారి సేవలను వినియోగించుకుని తీసివేసిన ఇస్తరాకు లాగా వారి పట్ల వ్యవహరించడం కార్యకర్తలకు మింగుడుపడటం లేదు. కోవర్టు నేతలకు, ఓట్లు లేని వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వడమే కారణంగా తెలుస్తోంది. పార్టీలో రాజకీయ వెన్నుపోటుదారులకు పెద్దపీటే వేయడమే కారణంగా ఆ పార్టీ నాయకులు గుసగుసలాడుకుంటున్నారు.

**చేసేదేమీ లేక టీడీపీ తీర్థం**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రజా బలం ఉన్న నాయకులు, కార్యకర్తలు ఎట్టకేలకు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి త్వరలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొని ఆ పార్టీకి మరింత బలం చేకూర్చేలా ప్రణాళికలు రచించుకుంటున్నట్లు పలువురు నేతలు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. ఇదిలా ఉంటే ఇప్పటికే ఆరు మండలాల్లో తెలుగుదేశం పార్టీ నాయకత్వంతో టచ్‌లో ఉండి పలువురు దేశం పార్టీ నాయకులతో మంతనాలు జరిపినట్లు కూడా సమాచారం. త్వరలో పలువురు ప్రథమ, ద్వితీయ స్థాయి నేతలు పలువురు కార్యకర్తలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి శాశ్వతంగా గుడ్ బై చెప్పి తెలుగుదేశం పార్టీలోకి చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఆ పార్టీ నాయకత్వం కూడా పార్టీ ఫిరాయించే నేతలకు, పార్టీలో చేరబోయే ప్రతి కార్యకర్త, నాయకులకు పార్టీ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని సాక్ష్యాత్తు దేశం పార్టీ నేతలే చెప్పుకుంటున్నారు.

**వైసీపీ జెండా ఎగురేసే పరిస్థితి లేదు**

-ఇది ఇలా ఉంటే కొండపిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గట్టు ఎక్కే పరిస్థితి లేదని పలువురు చర్చించుకుంటున్నారు. పార్టీ జెండాని ఎగరవేసి దుస్థితి ఏ కోశాన కానరావడం లేదనే పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తుంది. ఇక పార్టీకి ఇక్కడ వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్‌గా మిగిలిందనే చెప్పడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదని రాజకీయ విశ్లేషకులు చెప్పుకుంటున్నారు. ఏది ఏమైనా కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి గడ్డుకాలం ఏర్పడిందనే చెప్పవచ్చు.

# పేదలకు తక్కువ ధరకు నిత్యవసరాలు





షేక్ రియాజ్, టిడిపి నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, బండారు మాధవ్, తూము సుబ్బారావు కామరాజు గడ్డ కుసుమ కుమారి, పెద్ది శెట్టి వరలక్ష్మి, గోగినేని రామారావు, ఊతకోలు శ్రీనివాసరావు, ముస్లిం నాయకులు ఎస్‌కె గౌస్ బాబు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు పెనుకొండ శ్రీనివాసరావు, పప్పు శ్రీనివాసరావు, బిజెపి నాయకులు రాయపాటి అజయ్, సిద్దు, తదితరులు పాల్గొన్నారు.





# ఏకపాత్రాభినయ పోటీలు ప్రారంభం







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 11)**

రంగభూమి కళాకారుల సంఘం ఒంగోలు వారి ఆధ్వర్యంలో ప్రతినెల రెండో శనివారం జరుగుతున్న సాంస్కృతి కళా ప్రదర్శన ఏడో వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం ఈ నెల 11వ తేదీ ఏకపాత్రాభినైన పోటీలను ఎన్టీఆర్ కళాక్షేత్రంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సింగరాజు రాంబాబు, ఎద్దు శశికాంత్ భూషణ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. అనంతరం మాట్లాడుతూ కలలు నిజమైన కళాకారుడికి అర్పిస్తారని ప్రభుత్వం చేసే కార్యక్రమాలు కళల ద్వారా, కళాకారుల ద్వారా బయట ప్రపంచంలోకి ప్రజలకు చేరుతాయని అలాగే, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు, కళాకారులన్న కవులన్న గౌరవం ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సినీ రచయిత పాటిబండ్ల ఆనందరావు, బేతంచెట్టి హరిబాబు, బొమ్మరిల్లు నిర్వాహకురాలు పి.రాజ్యలక్ష్మి, రంగభూమి కళాకారుల సంఘం సభ్యులు ప్రసాదు, ధేనువకొండ సుబ్బయ్య, మాకా ఆంజనేయులు, ఏల్చూరి అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ జేఏసీ స్టూడెంట్స్ నూతన కమిటీ నియామకం



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జులై 11)**

ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రియాదవ్ ఆదేశాల మేరకు సూళ్లూరుపేటలో ఏపీ స్టూడెంట్స్ జెఎసి సూళ్లూరుపేట నియోజకవర్గ అధ్యక్షులుగా రాజేష్, నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా అంబూరు నవీన్‌ని నియమిస్తూ తిరుపతి జిల్లా అధ్యక్షులు గార్లపాటి శ్రీధర్ తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో ఏపీ స్టూడెంట్స్ జేఏసీని బలోపేతం చేస్తూ నియోజకవర్గ కమిటీలు మరియు జిల్లాస్థాయి కమిటీలు మరియు రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో కూడా పూర్తిస్థాయిగా ఏపీ స్టూడెంట్స్ జెఎసిని, బలోపేతం చేస్తున్నామని చెప్పి తెలిపారు. అదేవిధంగా గత పదేళ్లుగా కేంద్రంలో ఉన్న అధికార పార్టీకి పార్లమెంట్లో అధిక బలం ఉండడం చేత రాష్ట్రానికి రావాల్సినటువంటి విభజన హామీ చట్టాలను సాధించుకోలేకపోయామని,ఈరోజు పార్లమెంటులో ఉన్నటువంటి అధికార పార్టీకి సంఖ్యాబలం సరిగా లేనందువలన ఇతర పార్టీలపై ఆధారపడటం చేత ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా మా ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జెఎసి కమిటీలను పూర్తి చేసి బలోపేతంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు. ఎస్వీ యూనివర్శిటీ అధ్యక్షులు మల్చి ఉపేంద్ర మాట్లాడుతూ.. గతంలో సమైక్యాంధ్ర ఉద్యమాన్ని ఏ విధంగా చేశామో రాష్ట్ర ప్రజలందరికీ కూడా తెలుసని అంతకన్నా రెట్టింపుతో ఈ రాష్ట్రానికి రావాల్సినటువంటి ప్రత్యేక హెూదా మరియు విభజన హామీలను చట్టాలు అన్నిటిని సాధించుకొనుటకు కేంద్రంతో పోరాడుతామని చెప్పి తెలియజేశారు. అన్ని జిల్లాల్లో కమిటీలు పూర్తిచేసి మా యొక్క అజెండాలను రాష్ట్రస్థాయిలో ప్రకటన చేస్తామని చెప్పి ఆయన కార్యకర్తలతో మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమానికి సూళ్లూరుపేట నియోజకవర్గ ఏపీ స్టూడెంట్స్ జెఎసి కార్యదర్శులు మరియు ప్రధాన కార్యదర్శులు మరియు జెఎసి కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## జీవీఎస్ఎం కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం




**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 11)**
ఉలవపాడు జీవీఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి సాయి సురేష్, ఐక్యు ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ సి. హెచ్ మాణిక్యరావు ప్రసంగించారు. వారు సభను ఉద్దేశించి మాట్లాడుతూ నేడు ప్రపంచ జనాభా పెరుగుదల గురించి ప్రసంగించారు. నేడు ప్రపంచ జనాభా పెరుగుతున్నందున అనేక సమస్యలు చోటు చేసుకుంటున్న పరిస్థితుల్లో కుటుంబ నియంత్రణ, ఆరోగ్య సంరక్షణ యొక్క ప్రాముఖ్యతను గుర్తించాలని మహిళలు, బాలికలు సాధికారతకు ప్రభుత్వాలు కృషి చేయాలని అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈ కార్యక్రమంలోఅర్థశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ మర్రి బాబురావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## పొదిలికొండపల్లెలో నేను బడికి పోతా కార్యక్రమం విజయవంతం




**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జులై 11)**
మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పొదిలికొండ పల్లెలో గురువారం "నేను బడికి పోతా" అనే కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం.రామసుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రాథమిక పాఠశాల, పొదిలికొండ పల్లె ప్రధానోపాధ్యాయులు యస్. రమేష్ బాబు, ఉపాధ్యాయ బృందం పాల్గొని ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మొర్రి పిచ్చయ్య ఆధ్వర్యంలో నినాదాలు తయారు చేసి గ్రామ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈరోజు ర్యాలీ నిర్వహించి బడి-ఈడు పిల్లలందరూ బడిలో చేరాలని, పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు- బడిలో అని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిపారు. బడి మానేసిన విద్యార్థులను పాఠశాలలో తిరిగి చేర్చుకోవడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు.

## ప్రభుత్వ సచివాలయంలో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలు అందజేత



**(షణ్ముఖ వెలుగు, వెంకటగిరి ఇంచార్జి, జులై 11)**
తిరుపతి జిల్లా వెంకటగిరి మండలంలోని పాలెంకోట సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫోటోలను గురువారం స్థానిక టీడీపీ, జనసేన నాయకులు సచివాలయం సిబ్బందికి అందించారు. ప్రభుత్వ ఆదేశానుసారంగా చిత్రపటాలను అందజేసినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి రూరల్ టీడీపీ అధ్యక్షుడు గుగ్గిళ్ళ నాగరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, బూత్ కన్వీనర్ నరసింహులు, వెంకటేష్, కోటి, తదితర నాయకులు ఉన్నారు.

## వెంకటస్వామి నాయుడుకు నివాళులర్పించిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 11)**
తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కిలారి వెంకటస్వామి నాయుడు ఉత్తరక్రియల సందర్భంగా ఆయన చిత్రపటానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నివాళులు అర్పించారు. గురువారం నెల్లూరు బివినగర్‌లోని కిలారి ఇంటికి వెళ్లిన ప్రశాంతిరెడ్డి ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తెలుగుదేశం పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. జిల్లా గ్రంథాలయ ఛైర్మన్‌గా గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ నాయకులు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

# నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

### సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టాలి
### కనిగిరి నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలంటూ
### ఎమ్మెల్యే ఉగ్రకు వామపక్షాల, ప్రజాసంఘాల ఐక్యవేదిక విన్నపం



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 11)**
నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టాలని కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి వామపక్షాల, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఒక ప్రకటనలో విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎమ్మెల్యే ఉగ్ర ముందు ఉంచారు. కనిగిరి పెద్ద చెరువు, నాగుల చెరువులను ఆక్రమణదారుల నుంచి కాపాడాలన్నారు. కనిగిరి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నందలి వైద్య, ఇతర సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలన్నారు. కనిగిరి టౌన్ లో ఒంగోలు బస్టాండ్, చర్చి సెంటర్, గార్లపేట బస్టాండ్, తాలూకా ఆఫీస్ ఆవరణలో మూత్రశాలలు మరుగుదొడ్ల నిర్మాణం చేయాలనన్నారు. అదేవిధంగా కనిగిరిలో విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని, వాటికి విముక్తి కలిగించాలని కోరారు. మోడల్ స్కూల్ జగనన్న కాలనీ వాసుల సౌకర్యార్థం తారు రోడ్డు నిర్మాణం చేయాలన్నారు. గార్ల పేట రోడ్డు నుంచి తీగల గొంది రోడ్డును(దేవకి ప్లాజా, క్లబ్ మధ్య ఉన్న రోడ్డును) క్లబ్ వారు మూసివేశారని, వెంటనే తెరిపించాలని కోరారు. గార్లపేట రోడ్డు నుండి పోలీస్ క్వార్టర్స్ ఆనుకొని దక్షిణం వైపున ఉన్న సుభాష్ రోడ్డును మూసివేశారు. వెంటనే తెరిపించాలన్నారు. వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించి తోడ్పడా అందించాలని విన్నవించారు. రాగిమానిపల్లె బి తాళ్లూరు( వయా గుండ్లపాలెం )మధ్య తారురోడ్డు నిర్మాణం చేయాలని, నియోజకవర్గంలోని మేజర్ మైనర్ చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. అసైన్ భూముల్లో వెంచర్లను నిషేధించాలని, ప్రభుత్వ నిబంధనలను పాటించని రియల్ ఎస్టేట్ వెంచర్ యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కనిగిరి రెవెన్యూ డివిజన్ కేంద్రం. టౌన్ పరిధి మరింతగా విస్తరించిందని ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలన్నారు. 2024 జూన్‌లో ఏర్పడిన కొత్త ప్రభుత్వం, ఎమ్మెల్యే ఉగ్ర మున్సిపల్ పాలకవర్గం ఆ దిశగా శ్రద్ధ పెట్టాలన్నారు. ట్రాక్టర్ల ద్వారా నీటి సరఫరా కాంట్రాక్టర్లకు, అవినీతి అధికారులకు కాసుల వర్షం కురిపిస్తుందని, ట్యాంకర్ల ద్వారా జరిగే నీటి సరఫరా పై ప్రజలు ఆధార పడవలసిన దుస్థితికి నెట్టబడ్డారన్నారు. 10 రోజులకు ఒకసారి వాడుక నీరు, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయడం ఎంత దౌర్భా గ్యమని పేర్కొన్నారు. 1996లో వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన రాయివేశారు. 2004లో పనులు ప్రారంభించారు. అరకొర నిధుల కేటాయింపుతో పనులు ముందుకు సాగడం లేదన్నారు.
తక్షణ ప్రజా సమస్యలపై దృష్టి సారించి, పరిష్కారానికి తోడ్పడాలని సిపిఎం పివి శేషయ్య, సిపిఐఎం (లిబరేషన్) పాలూరి రమణారెడ్డి, సిపిఐ జిపి రామారావు, డి మల్లికార్జున్ (వికలాంగుల హక్కుల వేదిక), పి.మోహన్ (దళిత హక్కుల పోరాట సమితి) కోరారు.

# మంత్రి లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపిన దూదేకుల మస్తానయ్య కుటుంబం

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 11)**
రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను గురువారం ఉదయం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో కలిసి ఎన్.డి.ఏ. కూటమి సారథ్యంలోని నూతన తెలుగుదేశం ప్రభుత్వ ఏర్పాటు సందర్భంగా కుటుంబ సభ్యులు భార్య ఇద్దరు కుమార్తెలతో కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపినట్లు టిఎన్.టి.యు.సి. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దూదేకుల మస్తానయ్య పత్రిక ప్రకటనలో తెలిపారు. గత ఐదు సంవత్సరాల వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ అన్యాయ అక్రమాలను ప్రశ్నిస్తూ ఎదురొడ్డి నిలబడ్డ లోకేష్ ధైర్య సాహసాలను గుర్తు చేస్తూ రాష్ట్రంలోని పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అండగా నిలిచిన విధానంపై గుర్తుచేసీ అభినందించారు. మరి ముఖ్యంగా జిల్లాలో, మార్కాపురం నియోజకవర్గంలో ఎన్నికలకు ముందు ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ పర్యటనలు ఈ విజయానికి దోహదం చేశాయని



కొనియాడారు. తమ నాయకుడు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మీ దృష్టికి తీసుకు వచ్చే ముఖ్య సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా దోహదపడాలని అందులో ముఖ్యమైన మార్కాపురం ప్రాంత ప్రజలకు ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీల మేరకు వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని పరితగతిన పూర్తి చేయాలని కోరారు. తమ నాయకుడు మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి పార్టీలో తనకు తగిన గుర్తింపు నిస్తూ వివిధ పార్టీ పదవులను కట్టబెట్టారని క్రమశిక్షణ మరియు నిబద్ధత కలిగిన పార్టీ కార్యకర్తగా నాయకునిగా, మా నాయకుడు ఎమ్మెల్యే నారాయణరెడ్డి అనుచరునిగా ఉంటూ మీ ఆధ్వర్యంలో తుదికంట వరకు పనిచేస్తానని లోకేష్‌తో చెప్పానని మస్తానయ్య తెలిపారు. తన కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించిన చినబాబు లోకేష్ ఏ సమస్య ఎదురైన ఇబ్బంది కలిగిన నేనున్నానని మరిచిపోవద్దని, రాష్ట్రంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులేనని వారికి ఎల్లప్పుడూ అండదండగా నిలబడడం తన బాధ్యతగా లోకేష్ భరోసా ఇచ్చినట్లు దూదేకుల మస్తానయ్య తెలిపారు.

## పేదలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు సంతోషకరం

### ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ సతీమణి నాగసత్యలత







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 11)**
వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో ఉపాస్ హాస్పిటల్ వారి సహకారంతో గురువారం సంతపేట సాయిబాబా గుడిలో ఉచిత వైద్య శిబిరాన్ని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ సతీమణి నాగసత్యలత ప్రారంభించారు. నాగ సత్యలత మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్య శిబిరం పెట్టడం సంతోషంగా ఉందని, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారిని అభినందిస్తున్నట్లు తెలిపారు, ఎంతోమంది పేదవాళ్ళు హాస్పిటల్‌కి వెళ్లి డబ్బులు పెట్టుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాంటి వారికి వైద్య శిబిరం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిడమనూరి పావని,వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీకి ఉలవపాడు విద్యార్థుల ఎంపిక

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 11)**
మండలంలోని భీమవరం జడ్పీ హెచ్ఎస్ ఉన్నత పాఠశాల నందు ఇద్దరు విద్యార్థులు కే చందన, వి.స్పందన ఒంగోలు ట్రిపుల్ ఐటీ నందు ఎంపికయ్యారు.




మండల విద్యాశాఖ అధికారులు ఎంవివి ప్రసాద్ రావు, పీవీ రమణయ్యలు మాట్లాడుతూ ఉలవపాడు మండలానికి గర్వ కారణమని, ఆ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఆ విద్యార్థులు ఎంపిక కావడం మిగిలిన విద్యార్థులలో ఒక స్ఫూర్తి నింపుతుందని పేర్కొన్నారు. ఒక పోటీ ప్రపంచంలో ఉన్నత స్థానాల్లో ఉండే అవకాశం కలుగుతుందని తెలిపారు.

# హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రకాశం జిల్లా ఛైర్మన్‌గా గాడి మహేంద్ర నియామకం

### నియామక పత్రం అందచేసిన జాతీయ ఛైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 11)**
సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రకాశం జిల్లా ఛైర్మన్ గా పామూరు కు చెందిన గాడి మహేంద్ర ను నేషనల్ ఛైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్ అధికారికంగా నియమించారు. గురువారం అబిడ్స్‌లోని హోటల్ రీగల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జాతీయ ఛైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానవ హక్కుల పరిర్షణకు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వానికి, పాలక వర్గానికి,



పోలీసులకు తాము సహకారంగా ఉంటామని తెలిపారు. రాజ్యాంగము కల్పించిన హక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే జాతీయ మానవ హక్కుల కమిషన్ లో కేసు ఫైల్ చేసి నిజమైన భాదితులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. జిల్లా ఛైర్మన్ గా మహేంద్ర బాధ్యత గా పని చేసి, భాదితులకు, ప్రజలకు న్యాయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం మహేంద్ర మాట్లాడుతూ తన నియామకానికి సహకారం అందించిన నేషనల్ జనరల్ సెక్రెటరీ మామిడాల మనోహర్ కి, సౌత్ ఇండియా ఛైర్మన్ హన్మ గౌడ్ కి, తెలంగాణా రాష్ట్ర ఛైర్మన్ నోముల సంపత్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఛైర్మన్ బాలాజీ గారికి ధన్యవాదములు తెలిపారు . నాకు అప్పగించిన భాద్యతలను బాధ్యతగా నిర్వహిస్తానని, భారత రాజ్యాంగానికి, చట్టానికి కట్టుబడి పని చేస్తానని ప్రమాణం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం ఛైర్‌పర్సన్ పి రాజేశ్వరి, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ నవీన్ కుమార్, తెలంగాణా రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ బి సుధాకర్, సిరిసిల్ల జిల్లా ఛైర్మన్ గాజుల వేణు కుమార్, నిజామాబాద్ జిల్లా ప్రెసిడెంట్ కొప్పు రాజేందర్, నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుర్భిర్యాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# కాసుల కోసం కుల వివక్ష రిమ్స్‌లో డాక్టర్లను సస్పెండ్ చేయాలి

## రిమ్స్ సూపరింటిండెంట్ దుర్గా దేవికి దళిత నాయకుల ఫిర్యాదు
## విచారణ జరిపి చర్య తీసుకుంటాం: సూపరింటిండెంట్ హామీ

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 11)**

జిల్లా కేంద్రమైన ఒంగోలు గవర్నమెంట్ హాస్పిటల్లో కాసుల కక్కుర్తితో కుల వివక్ష పాటిస్తున్న డ్యూటీ డాక్టర్లును సస్పెండ్ చేయాలని రిమ్స్ సూపరింటిండెంట్ దుర్గా దేవికి దళిత నాయకులు నీలం నాగేంద్రరావు సృజన్ మాదిగ, ధారా అంజయ్య తదితరులు ఫిర్యాదు చేశారు. గురువారం రిమ్స్ హాస్పటల్లో సూపరింటిండెంట్‌ను కలిసి క్యాజువాలిటీలో డ్యూటీ డాక్టర్లు చేస్తున్న అక్రమాలను సాక్ష్యాధారాలతో సహా సూపరింటిండెంట్‌కు వివరించారు. ఎస్సీ, ఎస్టీ బాధితులు గాయపడి రిమ్స్ హాస్పిటల్‌కు వస్తే వైద్యం చేయకుండానే వెనక్కు పంపిస్తున్నారని ప్రైవేటు హాస్పటల్లో చేరమని బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అలాగే కొంతమంది డాక్టర్లు ఎమ్మెల్సీ కేసుల్ని కూడా నాన్ ఎమ్మెల్సీ కేసులుగా రెఫర్ చేస్తున్నారన్నారు. మరి కొంతమంది డాక్టర్లు అడ్మిషన్ చేసుకొని పోలీస్ ద్వారా కానీ మధ్యవర్తుల ద్వారా కానీ రేటు మాట్లాడుకుని అర్ధరాత్రి కూడా బయటకి గెంటివేస్తున్నారన్నారు. మరి కొంతమంది డాక్టర్లు ఎస్సీ, ఎస్టీ బాధితుల విషయంలో కొంతమంది డాక్టర్లు చికిత్స చేసిన ఔట్ పోస్టు పోలీసులకు రాతపూర్వకంగా ఇంటిమేషన్ ఇవ్వడం లేదన్నారు. డాక్టర్ ఇంటిమేషన్ లేనిదే తాము సంబంధిత పోలీస్ స్టేషన్లకు కేసు వివరాలు పంపలేమని రిమ్స్ అవుట్ పోస్ట్ పోలీస్ అధికారులు చెప్తున్నారన్నారు. బాధితులును మీరే వెళ్లి మీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసుకోండని కొంతమంది డాక్టర్లు హాస్పటల్ నుంచి పంపించి వేస్తున్నారన్నారు. దీనికి ఉదాహరణగా బల్లికురవ మండలం సూరేపల్లిలో జరిగిన గోగులమూడి నాగేంద్రం అనే ఎస్సీ,ఎస్టీ



కేసులో డాక్టర్ అహమద్ భాష వ్యవహరించిన నిరంకుశ కక్కుర్తి విధానాన్ని సూపరిండెంట్‌కు వివరించారు. అలాగే క్యాజువాలిటీలో డ్యూటీలో ఉన్న డాక్టర్లు "ఎప్రాన్"ధరించటం లేదని మెడలో స్టెతస్కోపు కూడా లేకుండా సివిల్ డ్రెస్‌లో కొంతమంది ఉంటున్నారు. డ్యూటీ డాక్టర్లు కొంతమంది క్యాజువాలిటీలో కాకుండా రూమ్స్‌లో రెస్ట్ తీసుకుంటున్నారన్నారు. రెండు నెలల క్రితం ఒంగోలులో మక్కెన వరకుమార్ అను ఆటో డ్రైవర్ను దండే సూర్య అను అంబులెన్స్ డ్రైవర్, రంగా కొంతమంది ఒంగోలు మంగమూరి రోడ్డులో దాడి చేస్తే రిమ్స్ హాస్పటల్లో అడ్మిట్ అయిన మక్కెన వర కుమారుని డ్యూటీ డాక్టర్ నాని ఎమ్మెల్సీగా నిర్ధారించారన్నారు. వర కుమార్ పై దాడి చేసిన నిందితులతో కుమ్మక్కై నిర్దాక్షిణ్యంగా వేకువజామున మూడు గంటలకు హాస్పటల్ నుంచి బలవంతంగా పంపించారన్నారు. నిన్ను అడ్మిట్ చేసుకుంటే మా ఉద్యోగాలు పోతాయి అని బెదిరించారన్నారు. మరలా 14వ తేదీ వరకుమార్ 108కి ఫోన్ చేసి మరలా గాయాలతో నొప్పులతో బాధపడుతూ రిమ్స్ హాస్పటల్లో చేరారు. 14 నుండి 20 తేదీ వరకు వరకుమార్ అదే హాస్పిటల్ లో ఎంఆర్ఐ స్కానింగ్‌లు, ఎక్స్‌రేలు తీయించారు.

గాయాలు ఏమీ లేకపోతే ఎక్స్‌రేలు, ఎమ్మారై స్కానింగ్‌లు మరలా వారం రోజులపాటు అడ్మిషన్ వరకు మార్కు మరో గవర్నమెంట్ డాక్టర్ ఎందుకు చేశారో చెప్పాలనీ సూపరింటిండెంట్ దళిత నాయకులు డిమాండ్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన ఓపి చీటిలు, మెడికల్ రిపోర్టులు, స్కానింగ్ కాపీలు సూపరింటిండెంట్‌కు అందించారు. పరిశీలించిన సూపరింటిండెంట్ దుర్గాదేవి డ్యూటీ డాక్టర్ల అందరితో సమావేశం ఏర్పాటు చేస్తామని క్యాజువాలిటీకి వచ్చే ఎస్సీ, ఎస్టీ బాధితులను అడ్మిట్ చేసుకోకుండా ఎమ్మెల్సీ కేసును అవుట్ పోస్ట్‌కు పంపించని డ్యూటీ డాక్టర్లపై చర్యలు తీసుకుంటామని దళిత నాయకులకు సూపరింటిండెంట్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులతో పాటు కాకుమాను రవి, బాధితుడు వరకుమార్, తదితరులు ఉన్నారు.

# వెలిశెట్టి కాశమ్మకు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, ఉడుముల శ్రీనివాసులరెడ్డి









**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 11)**

జిల్లా కాపు నాయకులు, వైసీపీ కాపు నేత వెలిశెట్టి వెంకటేశ్వర్లు (శ్రావణి) తల్లి వెలిశెట్టి కాశమ్మ ఈ నెల 1వ తేదీన అకాల మరణం పొందారు. దశదిన కర్మ గురువారం పట్టణంలోని శ్రావణి ఎస్టేట్స్ నందు గల శ్రావణి వెంకటేశ్వర్లు స్వగృహం నందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు, కంభం మాజీ ఎమ్మెల్యేలు అన్నా వెంకట రాంబాబు, ఉడుముల శ్రీనివాసులరెడ్డి, టీడీపీ హనుమంతునిపాడు మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, వెలిశెట్టి వెంకట నారాయణ, కొనకనమిట్ల మాజీ జడ్పీటిసి మెట్టు వెంకటరెడ్డి, కంభాలపాడు మాజీ సర్పంచ్ పులగొర్ల శ్రీనివాస్‌యాదవ్, పాపారావు, బజాజ్ రమణారెడ్డి, ధర్మారావు, సురేష్, తదితరులు పాల్గొని కాశమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# కాలువల పూడిక తీయించిన నగర కమీషనర్

## దుర్గంధం, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఊరట
## నెలలు తరబడి ఇబ్బంది పడుతున్న ప్రజలు















**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 11)**

పొదిలి పట్టణంలోని వాసవినగర్, మాయాబజార్, ఆంధ్రాబ్యాంక్, అమ్మవారిశాల వీధులలో కాలువల్లో మురుగు పేరుకుపోయి, నీళ్ళు వెళ్లలేక తీవ్రమైన దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నామని, ఆయా వీధులు ప్రజలు కమీషనర్ దృష్టికి తేవడంతో కమీషనర్ చంద్రశేఖర్ రెడ్డి వెంటనే స్పందించి అసలు సమస్య ఎక్కడ ఉందని అన్వేషణ ప్రారంభించగా, దర్శి రోడ్డులోని ప్రధాన కాలువ ఆక్రమణకు గురై మురుగు నిలిచి పోవడంతో సమస్యను గ్రహించి దర్శి రోడ్డులోని ఎస్ఎస్ఆర్ అపార్టుమెంట్స్ ఎదురుగా ఉన్న చిల్లచెట్లను తొలగించి కాలువ పూడిక తీయించడంతో మురుగునీరు ప్రవాహం కదిలింది. దీంతో పట్టణవాసులు సంతోషిస్తున్నారు. పట్టణంలో తీవ్రంగా దోమల బెడద ఎక్కువుగా ఉందని అసలే సీజనల్ వ్యాధుల సమయమని, దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో నగరపంచాయితీ కమీషనర్‌తో పాటు శానిటరీ ఇన్స్పెక్టర్ మారుతిరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత ప్రజానీకం కమిషనర్, శానిటేషన్ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# భార్యపై భర్త కత్తితో దాడి

## గొంతు కోస్తుండగా భార్య కేకలు
## పరారీలో భర్త
## బాధితురాలిని రిమ్స్‌కు తరలింపు
## కేసు నమోదు చేసిన పోలీసులు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 11)**

త్రోవగుంట హరిజనవాడలో దారుణం చోటుచేసుకుంది. చెడు వ్యసనాలకు బానిసైన కట్టుకున్న భర్తే భార్యను విచక్షణ రహితంగా మొహం, చేతులపై కత్తితో కోసి, కత్తితో గొంతు కోస్తుండగా బాధితురాలు పెద్దగా అరుపులు పెట్టడంతో భర్త పరారయ్యాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న కూచిపూడి నాగలక్ష్మి (30) కుటుంబ సభ్యులు రాత్రి రిమ్స్‌కి తరలించారు. విచక్షణ రహితంగా ప్రవర్తించి తన బిడ్డను చంపటానికి ప్రయత్నించిన భర్త కూచిపూడి గోపికృష్ణ పై కఠిన చర్యలు తీసుకోవాలని, మరోసారి ఇలా పునరావృతం కాకుండా బాధితురాలికి రక్షణ కల్పించాలని కోరారు. నాగలక్ష్మికి ఇద్దరు పిల్లలు. భవిష్యత్‌పై కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగలక్ష్మి తండ్రి ఇచ్చిన స్టేట్మెంట్‌తో తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ర

# హెల్మెట్ ధరించడంపై అవగాహన బైక్ ర్యాలీ






**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 11)**

హెల్మెట్ ధరించడంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ న్యాయమూర్తి కె భరత్ చంద్ర ఆధ్వర్యంలో గురువారం కనిగిరి పట్టణంలో మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. కనిగిరి కోర్టు నుంచి ఆర్టిసి డిపో, ప్రధాన కూడళ్లలో 70 ద్విచక్ర వాహనాలతో బైక్ ర్యాలీ సాగి ద్విచక్ర వాహనదారులు, పిలియన్ రైడర్లు హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించారు. ర్యాలీలో భాగమైన 70 మోటార్ సైకిళ్లలో 50కి పైగా పిలియన్ రైడర్లు ఉన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కె.భరత్ చంద్ర మాట్లాడుతూ రైడర్లు మాత్రమే గాక, పిలియన్ రైడర్లు కూడా హెల్మెట్ ధరించడం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం ర్యాలీ యొక్క ప్రధాన లక్ష్యమన్నారు. మోటార్ వాహనదారులు హెల్మెట్ ధరించుకుని, ప్రాణాలు కాపాడుకోవాలని, హెల్మెట్ భారం కాదని, అది మన బాధ్యత అని తెలిపారు. మోటారు వాహనాల చట్టంపై అవగాహన కలిగిస్తూ రైడర్‌తో పాటు పిలియన్ రైడర్ కూడా హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని ఆయన అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్డు భద్రతా నిబంధనలను పాటించని వారిపై రూ.1000 జరిమానా విధించడంతోపాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి లైసెన్స్ కూడా రద్దు చేయబడుతుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సి.ఐతో పాటు పోలీస్ సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది, మండల న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, న్యాయవాదులు, గుమస్తాలు తదితరులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటీకి ఎంపిక





**(షణ్ముఖ వెలుగు, మద్రిపూడి, జులై 11)**

త్రిబుల్ ఐటీకి సంబంధించిన మెరిట్ జాబితాలో కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రావూరి అర్చన కృష్ణా జిల్లా నూజివీడు నందు, చిర్రా రమ్య ఒంగోలు ట్రిబుల్ ఐటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీడీ కిషోర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులను, పాఠశాల సిబ్బందిని అభినందించారు.

# ఆధ్యాత్మిక గురువు డాక్టర్ జంధ్యాల శాస్త్రి

## ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్









(షణ్ముఖ వెలుగు, జరుగుమల్లి, జులై 11)

ఎందరికో ఆధ్యాత్మిక భావాలు పెంపొందించి వారి జీవితాలలో గ్రహదోషాలను తొలగించిన ఆధ్యాత్మిక గురువు డాక్టర్ జంధ్యాల శాస్త్రి అని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ అన్నారు. జరుగుమల్లి మండలం నర్సింగోలు గ్రామంలో డాక్టర్ జంధ్యాల శాస్త్రి కాంశ్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తాను తన కుటుంబ సభ్యులతో కలిసి నరసింగోలులోని ప్రత్యేక లింగరూప శనేశ్వరాలయాన్ని అనేకమార్లు సందర్శించానని, ఇది మహిమాన్వితమైన క్షేత్రమని అన్నారు. ఎంతో కాలంగా ప్రధాన అర్చక స్వామిగా బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ జంధ్యాల శాస్త్రి ప్రథమ వర్ధంతి సందర్భంగా స్మృతి వనం ఏర్పాటు చేయటం అభినందించదగిన విషయమని అన్నారు. వీరితోపాటు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మాగుంట రాఘవరెడ్డి, డాక్టర్ జంధ్యాల శాస్త్రి విగ్రహానికి పూజలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ దామచర్ల పూర్ణచంద్రరావు దంపతులు డాక్టర్ జంధ్యాల శాస్త్రి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్య అతిథులను నరసింగోలు ప్రత్యేక లింగ రూప శనీశ్వరాలయం ప్రధాన అర్చక స్వామి పైడిపాటి రామకృష్ణ శాస్త్రి, అర్చక బృందం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. డాక్టర్ జంధ్యాల శాస్త్రి కాంసె విగ్రహంతో పాటు నక్షత్రవనం, లింగాల రూపనవగ్రహాలు, గోశాలను ప్రారంభించారు. అతిథులు ఒక్కో నక్షత్రానికి గుర్తుగా ఒక్కొక్క మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో అర్చక స్వాములు జయ, పూజ, డిపిఓ నారాయణరెడ్డి, ఒంగోలు ఎలక్ట్రికల్ డి ఈ ఈ వినయ్ కుమార్ రెడ్డి, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు, నక్షత్రవనం ఆవశ్యకతను పైడిపాటి రామకృష్ణ శాస్త్రి వివరించారు. టంగుటూరు, జరుగుమల్లి మండలం, నరసింగోలు టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

### విద్యుత్ శాఖ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ అధికారి వెంకటేశ్వర్లు



(షణ్ముఖ వెలుగు, మద్రిపూడి, జులై 11)

మండలంలో గురువారం విద్యుత్ శాఖ విజిలెన్స్ బృందాలతో విద్యుత్ దాడులు నిర్వహించామని ఆ శాఖ విజిలెన్స్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కట్ట వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యుత్ సౌర్యానికి ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలా విద్యుత్ వాడకాన్ని అక్రమ మార్గంలో విద్యుత్‌ను అదనంగా వాడుకుంటే మొదట తప్పిదంగా కాంపౌండ్ పద్ధతిలో అపరాధ రుసుము వాసులు చేస్తామని రెండోసారి తప్పిదానికి గురైతే కేసులు పెట్టి అరెస్టు చేస్తామని తెలిపారు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు మాకు వాట్సప్ ద్వారా గాని, ఫోన్ ద్వారా గాని సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని మాకు సమాచారం ఇచ్చిన వారిని గోప్యంగా ఉంచుతామని వివరించారు. దర్శి ఎగ్జిక్యూటివ్ ఆపరేషన్ ఎస్ ఏ కరీమ్ మాట్లాడుతూ మండలంలో విస్తృతంగా విద్యుత్ దాడులు నిర్వహించామని ఈ ఆపరేషన్‌లో 16 మంది అధికారులు 85 మంది సిబ్బంది, 3222 సర్వీసులను తనిఖీ చేశామన్నారు. అదనపు లోడు వాడుతున్న 18 మందికి రూ.1,49,000 అపరాధ రుసుము విధించమన్నారు. అనుమతి లేని కేటగిరీలను కాకుండా ఇతర కేటగిరీలో వాడుతున్న నలుగురికి ఒక్కొక్కరికి రూ.6000 రూపాయలు చొప్పున అపరాధ రుసుము వసూలు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు ఆపరేషన్ సెక్షన్ అధికారులు పొదిలి, దర్శి, చీమకుర్తి అధికారులు కే శ్రీనివాసులురెడ్డి, కే పిచ్చయ్య, డివి కృష్ణారెడ్డి, విజిలెన్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఏ శ్రీనివాసరావు, పలు మండలాల ఏఈలు, మద్రిపూడి ఏఈ రామకృష్ణారెడ్డి, లైన్ ఇన్స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## లాంఛనంగా ప్రారంభించిన జనసేన పార్టీ కార్యాలయం







(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 11)

త్వరలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు, జనసేన జాతీయ మీడియా ప్రతినిధి వేములపాటి అజయ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ప్రారంభం కానుంది. ప్రతి జనసైనికుని మనసులో మాట మా కార్యాలయం ఎక్కడ అనే వాక్యాన్ని పూరిస్తూ భవిష్య జనసేన కార్యకర్తల పునాది వేస్తూ ప్రజలందరూ అనుకుంటున్నట్లుగా మన సమస్యకు పరిష్కారం జనసేన పార్టీ అని ఆ పార్టీ నాయకులు అన్నారు. దానికి నెల్లూరు జిల్లాలో వేదిక గోమతి నగర్ ఈ కార్యాలయం అనే విధంగా ప్రారంభమైందన్నారు. జనసేన వీర మహిళలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు నడుమ కోలాహలంగా పూజా కార్యక్రమాలు పూర్తయ్యాయి.

## ఆటో, బైక్ ఢీ ముగ్గురు పరిస్థితి విషమం









(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జులై 11)

పెద్దారవీడు మండలం తోక పల్లి సమీపంలో గురువారం ఉదయం ఆటో - ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో యర్రగొండపాలెం మండలం అమ్మాని గుడిపాడు గ్రామానికి చెందిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ముగ్గురు ఒకే కుటుంబానికి చెందినవారు. కుమారుడు 9వ తరగతి సుబ్రహ్మణ్య చారి 15 సంవత్సరాలు పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను స్థానిక మార్కాపురం జిల్లా ఆస్పత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గాయపడిన వారు గుడిపాడు గ్రామానికి చెందిన సిహెచ్ బ్రహ్మచారి(50), సిహెచ్ గంగాదేవి తీవ్ర గాయాలు కాగా, మోటార్ సైకిల్ మీద బ్రాండ్ ఏస్తున్న గంగుపల్లి గ్రామానికి చెందిన దేశాల రామానుజన్ నాయక్ గాయలయ్యాయి. వీరందరినీ మార్కాపురం జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతూ మెరుగైన వైద్యం కోసం వైద్యులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఘనంగా ఏపీపిటిడి (ఏపీఎస్ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవం



(షణ్ముఖ వెలుగు, వెంకటగిరి ఇన్‌ఛార్జి, జులై 11)

ఏపీపిటిడి (ఏపీఎస్ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం వెంకటగిరి ఏపీఎస్ఆర్టీసీ డిపో వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీఎస్ఆర్టీసీ వెంకటగిరి డిపో గౌరవ అధ్యక్షుడు, మాజీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు ఏపీపిటిడి విభాగంలో ఎంప్లాయిస్ యూనియన్ జెండా ఆవిష్కరించి అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎస్ఆర్టీసీ మన రాష్ట్రంలో ప్రారంభమైన తర్వాత డిపార్ట్మెంట్లలోని కార్మికులు సంక్షేమమే ధ్యేయంగా ఏర్పాటు చేసిన మొట్టమొదటి కార్మిక సంఘం ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 11-07-1951లో ఏర్పడిన యూనియన్ కార్మికులు సంక్షేమం కోసం అనేక ప్రణాళికాలను రూపొందించి వాటిని అమలు చేయడంలో రోజుకు 8 గంటలు పని విధానం నిర్వహిస్తూ, సంక్షేమ పథకాలు కోసం ఇట్లు యాజమాన్యంతో అట్లు ప్రభుత్వాలతో పోరాటం చేసి ఏకైక యూనియన్‌గా గుర్తింపు సాధించినది. ఈ కార్యక్రమంలో భాగంగా వెంకటగిరి డిపో కార్యదర్శి వై.వి ప్రసాద్ , అధ్యక్షులు రాజగోపాల్, జాయింట్ సెక్రెటరీ రమేష్, ట్రెజరీ తారకేశ్వర్, మోహన్ కిరణ్ డిపో నాయకులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## భారత న్యాయ సంహిత చట్టం106/1, 2 రద్దు చేయాలి

### సీఐటీయూ నేత జీవీబీ కుమార్ డిమాండ్



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 11)

మండల ఆటో వర్కర్స్ యూనియన్( సిఐటియు) జనరల్ బాడీ సమావేశం ఆ యూనియన్ అధ్యక్షులు ఎస్.డి.జహీర్ అధ్యక్షతన కరేడు రోడ్ లోని రైల్వే గేటు వద్ద జరిగింది. ఈ జనరల్ బాడీ సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు జీవీబీ కుమార్ మాట్లాడుతూ ఆటో, మోటార్ కార్మికులకు ఉరితాడుగా మారిన భారత న్యాయ సంహిత 2023,(106)1,2 చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే కొత్త క్రిమినల్ చట్టాల్లో భాగంగా భారతీయ న్యాయ సంహిత లోనే హిట్ అండ్ రన్ 106 / 1,2 సెక్షన్ల ప్రకారం ఒక డ్రైవర్ డ్రైవింగ్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు సంభవించే యాక్సిడెంట్‌లో మనిషి చనిపోవడం జరిగితే, పది సంవత్సరాలు జైలు శిక్ష, 10 లక్షల రూపాయలు జరిమానా విధించే ఈ క్రిమినల్ చట్టాలను వెంటనే రద్దు చేయాలన్నారు. లేదంటే ఈ చట్టాల వల్ల డ్రైవర్ అనే వాడు కనుమరుగైపోయే ప్రమాదం ఉందన్నారు. ఆగస్టు 5,6 తేదీలలో నెల్లూరులో జరుగుతున్న సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశం అనంతరం ఉలవపాడు మండల ఆటో వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఏ రాజారామ్, ఎస్ కె సుల్తాన్‌లు ఎన్నిక కాగా కోశాధికారిగా వై చిన్న(మహేంద్ర) ఉపాధ్యక్షులుగా వై.ప్రభాకర్, సహాయ కార్యదర్శిగా ఏ సూర్య ప్రకాష్, కమిటీ సభ్యులుగా సిహెచ్. ఆంటోనీ, కె కిషోర్, ఎస్‌డి ఖాదర్ వలి, జానకిలురెడ్డి తదితరులు ఎన్నికయ్యారు. ఈ జనరల్ బడి సమావేశంలో ఆటో వర్కర్స్ నాయకులు ఎం కోదండం, పల్లపు సుల్తాన్, నెల్లూరు శ్రీను, సింగరాయకొండ స్టాండ్‌లోని ఆటో కార్మికులందరూ పాల్గొన్నారు.

## తిరుమలకు మహా పాదయాత్ర

### టిడిపి కూటమి విజయంతో

### నక్క ఆనందబాబు అనుచరులు వేమూరు నుంచి తిరుమలకు పాదయాత్ర

### మనుబోలు దేశం నేతలు అపూర్వ స్వాగతం




(షణ్ముఖ వెలుగు, మనుబోలు, జులై 11)

మనుబోలు ఈ నెల11వ తేదీ ఉమ్మడి గుంటూరు జిల్లా వేమూరు నియోజకవర్గం కొల్లూరు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు 60 మంది తిరుమల పాదయాత్రకు బయలుదేరారు. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డి రాయపాటి కిరణ్,కలికి రమేష్ రెడ్డి కలికి సుధీర్. దామోదర్ రెడ్డి, పుట్టా మస్తాన్, సుమంత్, మారం రెడ్డి రమణారెడ్డి వీరికి బుధవారం సాయంత్రం స్వాగతం పలికారు. తిరిగి గురువారం ఉదయం కోదండరాంపురం పద్మావతి లాడ్జి నుంచి తిరుమలకు సాగనంపారు. వేమూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కూటమి విజయం సాధించి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం. వేమూరు నుంచి అభ్యర్థి నక్కా ఆనందబాబు అఖండ విజయం సాధించడంతో నియోజకవర్గంలోని కొల్లూరుకు చెందిన టిడిపి నేత కె.మధుసూదన్ ప్రసాద్ నేతృత్వంలో తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామికి మొక్కుబడి పెట్టుకున్నారు. ఈ ప్రయత్నంలో 60 మంది వేమూరు నుండి పాదయాత్రకు జూలై 1 నుండి బయలుదేరారు. ఇందులో భాగంగా పాదయాత్రకు వెళుతూ మనుబోలులో రాత్రి బస చేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తిరుపతి పార్లమెంటు కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి వీరికి దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చేసారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి రావడం ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు పదవిని అలంకరించడం.. రాబోయే ఐదు సంవత్సరాలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు పెద్ద పీట వేస్తారని ఆకాంక్షించారు. పాదయాత్ర బృందాన్ని దగ్గరుండి తిరుమలకు సాగనంపారు. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరుమలకు పాదయాత్ర చేస్తున్న బృందాలు జాతీయ రహదారిపై ప్రతిరోజు కనిపిస్తున్నాయి.

## ముమ్మరంగా శానిటేషన్ కార్యక్రమాలు





(షణ్ముఖ వెలుగు, మద్రిపూడి, జులై 11)

మద్రిపూడి మండల కేంద్రమైన మద్రిపూడి మాదిగ పల్లెలో గురువారం శానిటేషన్ కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. గత కొన్ని నెలలుగా కాలనీలో సైడ్ డ్రైన్‌లో చెత్తాచెదారం పేరుకుపోయి, ఎక్కడ మురుగు నీరు అక్కడే నిలువ చేరి దుర్వాసన వెదజలుతుంది. ఇటీవల కాలంలో మాదిగ పల్లె నివాసులు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి సుదీప దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. ఎంపీడీవో వెంటనే స్పందించి కార్యదర్శికి ఆదేశాలు ఇచ్చారు. క్షేత్రస్థాయి అధికారులు స్పందించి సమస్యకు వెంటనే పరిష్కార మార్గం చూపారు. ఆ క్రమంలోనే గత రెండు రోజులుగా సెంట్రేషన్ పనులు ముమ్మరంగా కార్యదర్శి పర్యవేక్షణలో జరుగుతున్నాయి. మాదిగ పల్లి నివాసులు గ్రామపంచాయతీ కార్యదర్శికి ధన్యవాదాలు తెలిపారు.

# చిన్న కుటుంబం చింతలేని కుటుంబం




(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 11)

ప్రపంచ జనాభా దినోత్సవంను పురస్కరించుకొని కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని కాశిరెడ్డి కాలనీలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సృజన నేతృత్వంలో వైద్య ఆరోగ్య శాఖ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ విచ్చేసి మాట్లాడుతూ, ప్రతి ఏడాది జూలై 11వ తేదీని ఐక్యరాజ్యసమితి వారి ఆదేశాల మేరకు ప్రపంచవ్యాప్తంగా జనాభా దినోత్సవం నిర్వహించుచున్నారని దీని యొక్క ముఖ్య ఉద్దేశ్యం ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకు పెరుగుతున్న జనాభాను నియంత్రించేందుకు, స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం, మానవ హక్కులు, బాల్య వివాహాలు, కుటుంబ సంక్షేమం, అధిక జనాభా వల్ల కలిగే నష్టాలు వంటి విషయాలపై అవగాహన కల్పించారు. సంపూర్ణ అక్షరాస్యత సాధించినప్పుడే ఈ అధిక జనాభా వల్ల కలిగే సమస్యలపై అవగాహన పెంచుకోవచ్చన్నారు. ప్రతిఒక్కరు కుల, మతాలకు అతీతంగా, జనాభాను నియంత్రించుటకు కుటుంబ నియత్రణ పాటించాలని అన్నారు. కార్యక్రమంలో సచివాలయం ఏఎన్ యం లక్ష్మి, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, జీఎస్అండ్‌జి డీకే ఫౌండేషన్ కోఆర్డినేటర్ పి.నవ కుమార్, ఆశా కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# నాగార్జున సాగర్ నీటిని విడుదల చేయాలి



(షణ్ముఖ వెలుగు, పెద్ద దోర్నాల, జులై 11)

పశ్చిమ ప్రకాశంలోని నాలుగు నియోజక వర్గాలు బాపట్ల జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు తాగునీటి అవసరాలకు కావలసిన 5టీఎంసీల నాగార్జున సాగర్ నీటిని విడుదల చేయాలని ఒంగోలు సర్కిల్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ కె.రవిని గుంటూరు క్యాంప్ అఫీస్‌లో యర్రగొండపాలెం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ పాకనాటి గౌతమ్ రాజ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజయ్ కుమార్ వినతి పత్రం అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే నీటి సమస్యను ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి త్వరలో నీటిని విడుదల చేస్తామని తెలిపారు.

# విద్యుత్ అధికారుల ఆకస్మిక తనిఖీలు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 11)

మార్కాపురం టౌన్ సెక్షన్ నందు విద్యుత్ విజిలెన్స్ ఈఈ శ్రీ కట్ట వెంకటేశ్వర్లు, ఆపరేషన్ ఈఈ పివి నాగేశ్వరరావు,విజిలెన్స్ సిఐ బి.టి. నాయక్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మార్కాపురం డివిజన్‌లో సిబ్బంది 39 బృందాలుగా ఏర్పడి మొత్తం 1638 సర్వీసులు మార్కాపురం టౌన్‌లో తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో అత్యధిక లోడు వాడుతున్న సర్వీసులు గాను ,మాల్ ప్రాక్టీస్ కేసులు విద్యుత్ చోర్యం కేసులు మొత్తము 125 కేసులకు గాను అపరాధ రుసుము 347,000 జరిమానా విధించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరిగిందని తెలియజేశారు. ఈ దాడుల్లో మార్కాపురం డిఈఈ ఎస్. సియ్యా నాయక్, గిద్దలూరు సబ్ డివిజన్ డిఈఈ శేషగిరిరావు, విద్యుత్ విజిలెన్స్ డిఈఈ శ్రీనివాసరావు , మార్కాపురం డివిజన్ ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా పి వి నాగేశ్వరరావు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మార్కాపురం మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, విద్యుత్ చౌర్యం చేసే వారిపై దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఆర్బిఐ మార్గదర్శకాలను అనుసరిస్తామన్నారు.

# వరసిద్ధి వినాయక స్వామి సేవలో తిరుపతి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు



(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జులై 11)

మన తిరుపతి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గని మంగళవారం మన తిరుపతి ప్రెస్ క్లబ్ నందు వ్యవస్థాపకులు తపసి మురళిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. గురువారం కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి సన్నిధిలో స్వామివారి దర్శనం అనంతరం కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యవర్గ సభ్యులను కాణిపాకం ఈవో వెంకటేశ్వర్లు అభినందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మన తిరుపతి ప్రెస్ క్లబ్ నూతన ప్రెసిడెంట్ వార్తశేషు, వైస్ ప్రెసిడెంట్ రెడ్డి ప్రసాద్, లోకేష్, సెక్రటరీ పద్మనాభ నాయుడు, జాయింట్ సెక్రటరీ వేణు గుండ్లూరి, వంశీకృష్ణ, ట్రెజరర్ రమేష్, పి ఆర్ ఓ హేమ కుమార్, మురళి, మీడియా ఇన్చార్జిగా అభిశంక, పొన్న రవికుమార్, కన్వీనర్ వేణు మల్లికార్జున, ఈసీ మెంబర్లుగా గోవర్ధన్ రెడ్డి , శేఖర్, మార్కండేయ రెడ్డి, కాణిపాకం పి ఆర్ ఓ నరేష్ మరియు గౌరవ అధ్యక్షులు కల్లూరు రంగయ్య ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. అనంతరం నూతన ప్రెసిడెంట్ శేషు మాట్లాడుతూ ముందుగా తన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ "మీ సమస్యలు – మా పరిష్కారం" దిశ వైపుగా మన తిరుపతి ప్రెస్ క్లబ్ ఎప్పుడు ప్రజల వైపు మరియు పాత్రికేయ సభ్యులకు అండగా ఉంటుందని తెలియజేశారు. మన తిరుపతి ప్రెస్ క్లబ్ సభ్యులకు, వారి కుటుంబలకు హాస్పిటల్స్, విద్య రంగంలోనూ రాయితీ కోసం కృషి చేస్తానని, ప్రజలకు, పాత్రికేయ మిత్రులకు ఏ సమస్య వచ్చినా మన తిరుపతి ప్రెస్ క్లబ్ ఒక వేదికగా ఉంటుందని తెలియజేశారు. ఈ అవకాశం కల్పించినందుకు మన తిరుపతి ప్రెస్ క్లబ్ వ్యవస్థాపకులు తపసి మురళిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి

(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జులై 11)



ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని నాయుడుపేట మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి అన్నారు. నాయుడుపేట పట్టణంలోని నారాయణ హైస్కూల్ వారు గురువారం చేపట్టిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పూర్వికులు అందించిన స్వచ్ఛమైన నీరు, గాలి, నేల లను యధావిధిగా ముందు తరాలకు అందించాలన్నారు. పరిశుభ్రత, పచ్చదనంతో కూడిన ఆరోగ్యంవంతమైన సమాజం కోసం పునరంకితమవ్వాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. నారాయణ హై స్కూల్ ఏజీఎం గురవయ్య మాట్లాడుతూ ప్రాచీన సంస్కృతులన్నీ ప్రకృతిని ఆరాధిస్తూ, చెట్లు నదులు పర్వతాలను గతంలో పూజించేవారని తెలియజేశారు. అలాగే ఒక చెట్టు నరికే ముందు ఐదు మొక్కలు నాటే వారన్నారు. వ్యర్థాలు ఉత్పత్తి చేయని జీవన విధానంలో యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల విద్యార్థులు పర్యావరణం, పరిరక్షణ, పరిశుభ్రత,పచ్చదనం పెంపొందించాలని కోరుతూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రిన్సిపాల్ రియాజ్, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్, ఏవో షేక్ గౌస్ బాషా, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కమిషనర్ వికాస్ మర్మత్‌కు ఘనంగా వీడ్కోలు




(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 11)

నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ గా విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన ఐఏఎస్ వికాస్ మర్మత్ కు కార్యాలయ సిబ్బంది, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నందు గురువారం జరిగిన ఆత్మీయ అభినందన వీడ్కోలు కార్యక్రమంలో కమిషనర్ గా వికాస్ మర్మత్ ను నగర పాలకసంస్థ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, ఉద్యోగ సంఘాల నాయకులు ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల ఉన్నతాధికారులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా విశిష్ట సేవా అవార్డులను అందుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. దాదాపు గడచిన 15 నెలల కాలంలో కమిషనర్ గా ఆయన చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, సంస్కరణలు అభినందనీయం అని పలువురు ప్రశంసించారు. భవిష్యత్తులో తిరిగి నెల్లూరు జిల్లా కలెక్టర్ గా వికాస్ మర్మత్ బాధ్యతలు స్వీకరించాలని ఆకాంక్షించారు. మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్, ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ మున్సిపల్ కార్పోరేషన్, నెల్లూరు వారి ఆధ్వర్యంలో కమిషనర్ ను ఘనంగా సత్కరించి వినాయక ప్రతిమను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ మలోల, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ సంపత్ కుమార్, అదనపు కమిషనర్ శర్మద, డెప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, సిటీ ప్లానర్ దేవీ కుమారి, టి.పి.ఆర్.ఓ ప్రసాద్, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, మేనేజర్ ఇనాయతుల్లా ఉద్యోగ సంఘాల నాయకులు శీనయ్య, చక్రపాణి, కృష్ణ కిషోర్, చిన్న బాబు, తదితరులు పాల్గొన్నారు.

# పేద పిల్లల కోసం పార్కులకు కృషి చేస్తున్న నాయకులకు అభినందనలు

### జనసేన నాయకులు గునుకుల కిషోర్



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 11)

నెల్లూరు రూరల్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సూచనలతో టెక్కేమిట్ట ప్రాంతంలో మహాలక్ష్మమ్మ గుడి పక్కన ప్రభుత్వ స్థలం వ్యర్థాలు నిండి స్థానికులకు ఇబ్బందిగా ఉండటంతో వాటిని క్లీన్ చేసి పార్కుగా ఏర్పరిస్తే పేద పిల్లలు ఆడుకోవడానికి ఉపయోగపడుతుందని పరిసర ప్రాంతాలను శుభ్రం చేస్తున్న మాజీ మేయర్, తెలుగుదేశం నాయకురాలు నంది మండలం భాను శ్రీని కలిసి అభినందనలు తెలిపారు. టిడ్కో ఇళ్ళ వద్ద కూడా పార్కులు ఏర్పాటు చేసి పార్కులు కేవలం ధనికులకే కాదు పేద పిల్లలు ఆడుకోవడానికి పార్కులు అవసరం ఉందంటూ ఐదు సంవత్సరాల ముందు ఎన్నో పార్కులు నిర్మించి ఆగిన మిగిలిన పార్కులు పనులు త్వరలో ప్రారంభిస్తామని చెబుతున్న మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ బాటలోనే తెలుగుదేశం నాయకులందరూ కూడా పేదల పట్ల అభిమానం చూపడం హర్షినీయమన్నారు. గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో వైసిపి నాయకులు సహజ వనరులు ఎలా దోచుకు తినాలి ప్రజలను ఎలా పీడించి డబ్బులు అక్రమంగా సంపాదించాలని ఆలోచనలతో ఉంటే ప్రస్తుత మా ప్రజా ప్రభుత్వ నాయకులు తమ సమయాన్ని పేదల జీవన ప్రమాణాల పెంచేందుకు వెచ్చించటం అభినందనీయమన్నారు. నంది మండలం భాను శ్రీ గతంలో నగర మేయర్‌గా అప్పట్లోనే పార్కుల స్థలాలను వెలికి తీసేందుకు చేసిన ప్రయత్నాలు, సేవలు ప్రజలందరూ మర్చిపోనివని మరోసారి గుర్తు చేశారు.

# స్వచ్ఛమైన చిరునవ్వుతో నిండుగా పలకరించే వ్యక్తి

### స్వర్గీయ కిలారు వెంకట స్వామి నాయుడు

### స్మారక సభలో జనసేన నాయకులు గునుకుల కిషోర్



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 11)

దాదాపుగా 40 సంవత్సరాలుగా రెండుసార్లు కార్పొరేటర్‌గా ఒకసారి గ్రంధాలయ



చైర్మన్‌గా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు,నెల్లూరు ప్రజల మదిలో చెరగని ముద్ర వేసిన కిలారి వెంకట స్వామి నాయుడు ఇకలేరు అనే విషయం నమ్మశక్యం కాని నిజం. దాదాపుగా నాలుగు దశాబ్దాల పాటు ఒకే పార్టీలో ఉంటూ అందరి మన్ననలూ పొందుతూ రాజకీయంగా ఎలా నడవడుచుకోవాలో అనే విషయాన్ని నాలాటి వారికి మార్గదర్శకంగా నిలిచారు. నిన్నటి రూరల్ ఎన్నికల్లో కూడా ప్రజా ప్రభుత్వం ఏర్పాటుకు నిస్వార్ధంగా పనిచేసిన వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# ఘోర రోడ్డు ప్రమాదం ముగ్గురు ఒరిస్సా వలస కార్మికులు మృతి



(షణ్ముఖ వెలుగు, తిరుపతి ఇన్‌ఛార్జి, జులై 11)

సత్యవేడు నియోజకవర్గం బిఎన్ కండ్రిక మండలం పార్లపల్లి గ్రామం క్రాస్, తడ – శ్రీకాళహస్తి రోడ్డు వద్ద గురువారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎపి05 సిఎఫ్4334 గల కారు తడ నుండి శ్రీకాళహస్తి వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఎపి 03 7668 గల పల్సర్ మోటారు బైక్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం పై వెళుతున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులంతా అలత్తూరు, బిఎన్ కండ్రికలోని శ్రీ నిది రాజా కార్డ్‌బోర్డు బాక్స్ కంపెనీలో పని చేస్తున్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వలస కార్మికులుగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com